నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644
సంచిక : 25 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 3-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

### నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

చెప్పులున్న తొడిగి,చెప్పుడు పలుకుల
గుడికి వెళ్ళటమ్ము ,గొడవలకును
పనికిరాదువినుము మనిషి జీవితమున
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


### విలేకరులు కావలెను
తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# తెలంగాణ కోటి రత్నాలవీణ

## త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల

67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం

కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టాం

- టీజీపీఎస్సీ ద్వారా విడుదల చేస్తాం
- జాబ్ నోటిఫికేషన్ల జారీ నిరంతర ప్రక్రియ
- న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ
- నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- విజన్-2047 లక్ష్యం దిశగా ముందుకు..
- కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టాం
- నాటి నుంచి రాష్ట్ర హితంకై శ్రమిస్తున్నాం
- రాచరికం, పెత్తనాన్ని సమాజం సహించదు
- నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదు
- ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం
- రుణమాఫీతో రైతులను రుణ విముక్తి చేశాం
- తొలి ఏడాదిలోనే రూ.22 వేల కోట్లు జమ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి
- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం చిత్తశుద్ధి
- కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తాం
- మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతాం
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు
- రాష్ట్ర మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ విషెస్
- ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహణ
- అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన సీఎం

**హైదరాబాద్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిషికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేకధన్యవాదాలు తెలియజేశారు.

-మిగతా 2 లో











# భారత్‌లో ఎబోలా టెన్షన్..

- ఒక కొత్త స్ట్రెయిన్ వేగంగా వ్యాప్తి
- అప్రమత్తమైన భారత ప్రభుత్వం

2 లో



# బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

- తదుపరి కొత్త పార్టీ ఏర్పాటుపై దృష్టి
- సొంత పార్టీతో ఉపఎన్నికల్లో పోటీ!!

2 లో

# జనసేన పుట్టిందే తెలంగాణలో

## అందుకే ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేస్తుంది



- ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు
- తెలంగాణ గడ్డపై నుంచే పోరాటం పుణికి పుచ్చుకున్నా
- తెలంగాణ అంటే గౌరవంతోనే కొండగట్టుకు కోట్ల విరాళం
- తెలంగాణను వ్యతిరేకించిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు
- తెలంగాణకు ద్రోహం జరిగితే గొంతు లేపేది జనసేనే
- తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం
- ఎవరి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు
- మీడియా సమావేశంలో జనసేనాని పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ

**హైదరాబాద్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు. తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి

-మిగతా 2 లో



# పశ్చిమ ఆసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- మరోసారి తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు
- కొలిక్కిరాని దౌత్యపరమైన ప్రయత్నాలు
- చర్చలు నిలిపేస్తున్నామని ఇరాన్ ప్రకటన
- 'హార్ముజ్' జలసంధిని పూర్తిగా మూసివేత!!

**న్యూఢిల్లీ,**
పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్)లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన సైనిక చర్యలను మరింత విస్తృతం చేయడాన్ని నిరసిస్తూ.. అమెరికాతో మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న దౌత్యపరమైన చర్చలను ఇరాన్ సోమవారం రద్దు చేసుకుంది. ఈ మేరకు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'తస్నిమ్' ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమ ఆసియాలో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు పూర్తిగా స్తంభించిపోవడంతో ఇరాన్ చర్చల బృందం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సదరు వార్తా సంస్థ పేర్కొంది. ఈ చర్చల నిలిపివేతపై ఇరాన్ ప్రతినిధులు స్పందిస్తూ.. "లెబనాన్‌లో ఇజ్రాయెల్ నిరంతరం సాగిస్తున్న అకృత్యాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. కాల్పుల విరమణ ఒప్పందానికి లెబనాన్ అంశం ఒక ముఖ్యమైన ముందస్తు షరతు. కానీ ఇప్పుడు లెబనాన్‌తో సహా అన్ని రంగాలలోనూ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. అందుకే మధ్యవర్తుల ద్వారా అమెరికాతో జరుపుతున్న చర్చలను, పత్రాల మార్పిడిని ఇరాన్ బృందం తాత్కాలికంగా నిలిపివేస్తోంది" అని తస్నిమ్ నివేదించింది.ఆక్రమిత ప్రాంతాల నుండి

-మిగతా 2 లో

# కర్నాటక సిఎంగా నేడు శివకుమార్ ప్రమాణం



- ఆయనతో పాటు మరో పదిమంది మంత్రులకు అవకాశం
- లోక్‌భవన్‌లో సాయంత్రం 4గంటలకు ప్రమాణ కార్యక్రమం
- రాహుల్ సహా పలువురు కాంగ్రెస్ నేతల హాజరు

**బెంగళూరు**
కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీకే శివకుమార్ 3న బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మరో 10 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో డీకే శివకుమార్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారంనాడు చర్చలు జరిపిన అనంతరం తొలివిడత క్యాబినెట్ కూర్పునకు సంబంధించిన కసరత్తు పూర్తయినట్టు చెబుతున్నారు. కొద్ది రోజుల వ్యవధిలోనే మంత్రివర్గ విస్తరణ కూడా ఉంటుందని ఆ వర్గాలు తెలిపాయి. బెంగళూరులోని లోక్ భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పలువురు సీనియర్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. డీకే శివకుమార్‌తో పాటు ప్రమాణస్వీకారం చేసేవారిలో..కేజే జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరేగౌడ, యూటీ ఖదెర్, మల్లనగౌడ బసనగౌడ పాటిల్, సతీష్ జార్కిహోళి, ప్రియాంక్ ఖర్గే, యతీంద్ర సిద్ధరామయ్య, లక్ష్మీ బెబ్బాల్కర్‌లు ఉన్నారు.పరిమిత అతిథుల సమక్షంలో నిరాడంబరంగా ఈ కార్యక్రమం నిర్వహించాలనుకుంటున్నట్లు శివుమార్ తెలిపారు. పార్టీ కార్యకర్తగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన తాను సీఎం స్థాయికి ఎదగడం వెనక గాంధీ కుటుంబం ఉందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఒక యువ కార్యకర్తగా తనలోని సామర్థ్యాన్ని దివంగత పీఎం రాజీవ్ గాంధీ గుర్తించారని అన్నారు. జీవితాన్ని ఏవిధంగా

-మిగతా 2 లో

# ఇది మా అయ్య జాగీరే నీ అయ్య జాగీరు కాదు



- కొండగట్టుకు పైసలు నీ జేబుల నుంచి ఇచ్చినవా?
- నువ్వో పేమెంట్ ఆర్టిస్టువి
- బీజేపీ కోసమో, బీఆర్ఎస్ కోసమో ప్యాకేజీ తీసుకొని మాట్లాడుతున్నవ్
- గెలుకుతానంటే ఊరుకోం
- అమిత్ షా కోసమే మధ్యమధ్యలో ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నడు
- నీ ప్యాకేజీ నెలకు 50 కోట్లని బయట టాక్
- పవన్ కళ్యాణ్‌పై విరుచుకుపడిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే అనిరుధ్

2 లో

# రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగులేదు

## తమతో పోటీకి దిగే ప్రత్యర్థులే లేరు

- రాష్ట్ర అభివృద్ధికి కేబినేట్ జట్టుగా పనిచేస్తోంది
- తామంతా నూరుశాతం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- ధాన్యం సేకరణ వైఫల్యం మమ్మాటికీ బిజెపిదే
- మీడియతో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క

**ఖమ్మం జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై మీడియా దృష్టి పెట్టాలని.. ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రతి ఒక్కరూ సర్ మ్యాపింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణ అవతరణ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులే లేరని వ్యాఖ్యానించారు. 'రైతు వ్యతిరేక పార్టీ భాజపానే. పని చేసే పార్టీలకు ప్రచారం అవసరం లేదు. అసెంబ్లీ, ఎంపీ,

-మిగతా 2 లో



# పశ్చిమ ఆసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

మొదటి తరువాయి

ఇజ్రాయెల్ దళాలు పూర్తిగా వెనక్కి వెళ్లాలని, అలాగే గాజా, లెబనాన్‌లలో సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయాలనే తమ డిమాండ్లు నెరవేరే వరకు అమెరికాతో దౌత్యపరమైన చర్చలను తిరిగి ప్రారంభించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి కొద్దిసేపటి ముందే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ సోషల్ మీడియా వేదికగా అమెరికా, ఇజ్రాయెల్‌లను హెచ్చరించారు. లెబనాన్‌లో ఉద్రిక్తతలు పెంచడం అంటే.. అమెరికాతో కుదిరిన విస్తృత కాల్పుల విరమణ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. "ఇరాన్–అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనేది నిస్సందేహంగా లెబనాన్‌తో సహా అన్ని రంగాలకు వర్తిస్తుంది. ఏదైనా ఒక రంగంలో దీనిని ఉల్లంఘిస్తే, అది అన్ని వైపులా ఉల్లంఘించినట్లే అవుతుంది. దీనివల్ల వచ్చే పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది." అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ పేర్కొన్నారు. అమెరికాతో దౌత్య సంబంధాలు తెంచుకోవడంతో పాటు, ఇరాన్ తన కూటమి దేశాలతో కలిసి అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్'ను పూర్తిగా స్తంభించిపోయేలా చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు ప్రకటించింది. దీనితో పాటు ఎర్రసముద్రంలోని 'బాబ్ ఎల్ మండేబ్'జలసంధి లోనూ ఇతర వ్యూహాత్మక పంథాలను అస్త్రాలుగా మార్చి, ఇజ్రాయెల్ మరియు దానికి మద్దతు ఇస్తున్న దేశాలను ఆర్థికంగా, సైనికంగా 'శిక్షించాలని' ఇరాన్ కూటమి నిర్ణయించింది. గాజా, లేబనాన్‌లలో ఇజ్రాయెల్ క్రూరమైన ఆర్మీ ఆపరేషన్లను తక్షణమే ఆపాలని, లేదంటే ఈ ప్రతిఘటన మరింత తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పట్టుబడుతోంది. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయ చమురు సరఫరాకు మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారత్‌లో ఎబోలా టెన్షన్..

## ఒక కొత్త స్ట్రెయిన్ వేగంగా వ్యాప్తి
## అప్రమత్తమైన భారత ప్రభుత్వం



**న్యూఢిల్లీ,**
కాంగో, ఉగాండా తదితర ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాధి వేగంగా విస్తరిస్తున్న తరుణంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలాలోని అత్యంత ప్రమాదకరమైన 'బుండిబుగ్యో' స్ట్రెయిన్ వేగంగా వ్యాపిస్తుండటంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తాజా గైడ్‌లైన్స్ జారీ చేసింది. ముఖ్యంగా డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని భారతీయులను కోరినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారిక ప్రకటన ద్వారా చెప్పింది. తాజా పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. మే 17, 2026న ఈ ఎబోలా వ్యాప్తిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్ గా ప్రకటించింది. అలాగే ఆఫ్రికా సీడీసీ సైతం దీనిని ఖండాంతర భద్రతా ముప్పుగా పరిగణించిందని 'ద హిందూ' పత్రిక తన నివేదికలో తెలిపింది. ఈ ప్రమాదకర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మే చివరి వారంలో కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, విమానాశ్రయాల్లో పటిష్టమైన స్క్రీనింగ్, నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఇప్పటివరకు ఎబోలా (బుండిబుగ్యో స్ట్రెయిన్) కేసులు ఏవీ నమోదు కాలేదనీ, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ముందస్తు జాగ్రత్తగా అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ తప్పనిసరి చేశారు. గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి నేరుగా వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించి వచ్చిన వారు కచ్చితంగా స్వీయ నిర్బంధంలో ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ గట్టిగా సూచించింది. ఒకవేళ ఆ ప్రయాణికులలో అకస్మాత్తుగా జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, విరేచనాలు, లేదా శరీరంలో ఎక్కడినుంచైనా అకారణంగా రక్తస్రావం కావడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే స్థానిక ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలి. సాయం కోసం వెంటనే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ '1075' కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేసింది. సకాలంలో వైద్య సహాయం పొందడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, ఇతరులకు వ్యాధి సోకకుండా నిరోధించవచ్చని ది హిందూ రిపోర్ట్ చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పంపింది. ఆసుపత్రులలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, పరీక్షల కోసం ల్యాబొరేటరీలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలని.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. విమానాశ్రయంలో ఎవరైనా అనుమానిత రోగులు గుర్తిస్తే వెంటనే వారిని ప్రత్యేక అంబులెన్సుల ద్వారా ఐసోలేషన్ సెంటర్లకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

# బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

## తదుపరి కొత్త పార్టీ ఏర్పాటుపై దృష్టి
## సొంత పార్టీతో ఉపఎన్నికల్లో పోటీ!!




**కోయంబత్తూరు,**
: తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎస్ మాజీ అధికారి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కే. అన్నామలై ఆ పార్టీకి రాజీనామా చేశారు. దిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌లను కలిసి తన 5 పేజీల రాజీనామా లేఖను సమర్పించారు. కొద్ది రోజులుగా అన్నామలై తదుపరి అడుగులపై సాగుతున్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. గత ఆరేళ్లుగా తమిళనాట బీజేపీకి 'స్టార్' ఇమేజ్ తెచ్చిన అన్నామలై, తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఐదు పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన పార్టీ కేంద్ర నాయకత్వంతో తనకు ఉన్న వ్యూహాత్మక విభేదాలను స్పష్టంగా ప్రస్తావించినట్లు తమిళ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తో పొత్తు పెట్టుకోవాలన్న దిల్లీ పెద్దల నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని తాను కోరుకుంటే, అధిష్ఠానం మాత్రం ద్రావిడ పార్టీలపై ఆధారపడటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపులో అన్నామలై అభిప్రాయాలను కేంద్ర నాయకత్వం పక్కన పెట్టింది. తనకు కేవలం ఆరు స్థానాల బాధ్యతలు మాత్రమే అప్పగించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి చెందారు. ఫలితంగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడం, పార్టీ ఘోర పరాజయం పాలుకావడంతో అన్నామలై వాదన నిజమైంది. బీజేపీలో తనకు తగినంత స్వేచ్ఛ, భవిష్యత్తు లేవని భావించిన ఆయన, సుదీర్ఘ చర్చల అనంతరం కమలం గూటి నుంచి బయటకు రావడమే ఉత్తమమని భావించారు. అన్నామలై రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదు, పైగా మరింత దూకుడు పెంచబోతున్నారు.

# కర్నాటక సిఎంగా నేడు శివకుమార్ ప్రమాణం

మొదటి తరువాయి

ప్రజా సేవకు అంకితం చేయాలి, ప్రజల హక్కుల కోసం ఎలా పోరాడాలి అనే ఎన్నో విషయాలపై తనకు మార్గదర్శనం చేశారన్నారు. రాజకీయ జీవితం క్లిష్ట దశల్లో ఉన్నప్పుడు సోనియాగాంధీ అందించిన మద్దతే తనను ముందుకు నడిపిందన్నారు. రాహుల్ గాంధీ నుంచి ప్రజాస్వామ్య విలువలు, అన్యాయాన్ని వ్యతిరేకించే వైఖరిని నేర్చుకున్నానని పేర్కొన్నారు. నిజమైన నాయకులు కేవలం విజయాలు సాధించిన సమయాల్లోనే అండగా నిలబడరని.. అత్యంత కష్ట సమయాల్లోనూ పక్కనే ఉంటారని అన్నారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసినా సీఎం బంగ్లాలోనే ఆయన నివాసం ఉండనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సీఎంగా ఎన్నికైన వారికి అధికారిక బంగ్లా అయిన 'కావేరి'ని నివాసంగా కేటాయిస్తారు. అయితే సిద్ధూ–డీకేల మధ్య ఒప్పందం ప్రకారం సిద్ధరామయ్య సీఎం పదవికి రాజీనామా చేసినప్పటికీ 2028 సంవత్సరం వరకు కావేరి బంగ్లాలోనే ఉండనున్నారు. ఈ క్రమంలో నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న డీకేకు వేరే అధికారిక నివాసం ఏర్పాటుచేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అప్పటివరకు డీకే తన ప్రైవేటు నివాసంలోనే ఉంటూ అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# తెలంగాణ మా అయ్య జాగీరే

**హైదరాబాద్,**
తెలంగాణ మీ అయ్య జాగీరా అంటూ ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. అవును తెలంగాణ మా అయ్య జాగీరే.. తెలంగాణ ప్రజల అయ్య జాగీరేనంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది మా అయ్య జాగీరేనని, మా తెలంగాణ ప్రజల నాలుగు కోట్ల ప్రజల అయ్య జాగీరేనని, నీ అయ్య జాగీరు కాదని గుర్తు పెట్టుకోమని వ్యాఖ్యానించారు. చనిపోయిన తెలంగాణ కళాకారుడు గద్దర్‌కు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గద్దర్‌కు కారు కొనిచ్చానని చెప్పారని, చనిపోయిన వారి గురించి మాట్లాడడమే అప్రస్తుతమని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ అహంకారమేంటో తెలంగాణలోని దళిత వర్గాలు ఆలోచన చేయాలని అన్నారు.

# తెలంగాణ కోటి రత్నాలవీణ

మొదటి తరువాయి

ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్–2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా



ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్–2047 లక్ష్యం సాధించే దిశగా వెళు _న్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్? రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

కాగా.. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. హనుమకొండలో అమరవీరుల స్థూపానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వద్ద నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. నల్గొండ క్లాక్ టవర్ కూడలి వద్ద అమరవీరుల స్థూపానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పుష్పాలతో నివాళి అర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయపతాకావిష్కరణ చేశారు. నల్గొండలోని కలెక్టరేట్?లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగ ఫలితమే మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్గొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ కూడా ముందుకు సాగదన్నారు. నల్గొండ కేవలం జిల్లా కాదని విప్లవాల పురిటి గడ్డ, అన్యాయంపై తిరగబడ్డ వీరుల అడ్డా అని వెంకట్?రెడ్డి చెప్పారు. నా భూమి జోలికొస్తే ఆ భూమిలోనే నీ గోరి కడతాం అని దొరల గుండెల్లో వణుకు పుట్టించిందన్నారు. నల్గొండ గడ్డ మన పిల్లలు లాఠీ దెబ్బలు తింటే, శ్రీకాంతాచారి తన ప్రాణాన్ని త్యాగం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేదని అన్నారు. తానెప్పుడూ పదవుల కోసం ఆశపడలేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరకపోతే ఈ పదవులు ఎందుకని నాడు మంత్రి పదవిని విసిరికొట్టి ఉద్యమంలోకి దిగిన చరిత్ర తనదన్నారు.

# జనసేన పుట్టిందే తెలంగాణలో

మొదటి తరువాయి

కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించానని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007–08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యానించారు. వైసీపీ తనను ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టనివ్వనంటే ఈ ప్రాంతం ఆదరించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే తాను అధికారం కోరుకోలే దన్నారు. అలాంటిది తెలంగాణలో ఎందుకు కోరుకుంటానని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు, నాయకులకు ఆంధ్రప్రదేశ్‌పై విద్వేషం లేదన్నారు. విద్వేషం చూపించి ఉంటే ఆ రాష్ట్ర ప్రజలు ఇక్కడ తిరిగేవారు కాదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తనకేం పని కొందరు ప్రశ్నిస్తున్నారన్నారు. మీరు ఎవరు తనను బెదిరించడానికి అని ప్రశ్నించారు. తెలంగాణ మీ అయ్య జాగీరా అని వారిని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ నిలదీశారు. తనపై దాడులు చేస్తామంటున్నారన్నారు. తనకు తెలంగాణలో కంటే ఏపీలోనే బెదిరింపులు అధికంగా ఉన్నాయని చెప్పారు. 2019 తాను ఓడిపోయినప్పుడు.. తెలంగాణ వాసులే.. ఇక్కడ ఆ పరిస్థితి రాదన్నారని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణలో జనసేన ఎదగాలని ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. మీరు ఎన్ని తిట్లు తిట్టినా.. తన గుండెలో తెలంగాణ ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ గూండాల బెదిరింపుల ముందు ఈ బెదిరింపులు ఓ లెక్కా? అని అన్నారు. ఓ విశ్లేషకుడు ఇక్కడ తన గురించి తప్పుగా మాట్లాడారని తెలిపారు. ఆ విశ్లేషకుడి వల్లే ఈ గొడవ మొదలైందన్నారు. ఆ వ్యాఖ్యలపైనే జనసేన సైనికులు స్పందించారని వివరించారు. కొన్ని చోట్ల కేసులు పెట్టారు.. అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించి 13 ఏళ్లు గడుస్తున్నా ఇంకా మేం నోరు మూసుకుని కూర్చోవాలా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో మార్పు తప్ప మేం అధికారం కోరుకోవడం లేదని పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. వాళ్లను అక్కడి నుంచి వెళ్లిపోమనడం కరెక్టేనా? అని ప్రశ్నించారు. ఇదిలావుంటే జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూబ్లీహిల్స్ నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆయన నివాసం వద్దకు భారీగా అభిమానులు, జనసేన కార్యకర్తలు చేరుకున్నారు. పవన్ ఇంటి వరకు వారిని పోలీసులు అనుమతించకపోవడం, అలాగే, జనసేన తలపెట్టిన జన సంకల్ప సభకు అనుమతి నిరాకరించడంపై కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పవన్ ఇంటివైపు వెళ్తున్న జనసేన శ్రేణులు, అభిమానులను పోలీసులు అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పవన్ నివాసం సమీపంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఊపిరిలూదుకొన్నది తెలంగాణ గడ్డపైనేనని పేర్కొన్నారు. ఈ నేల నుంచే వారసత్వంగా పోరాట పటిమను పుణికి పుచ్చుకున్నదని చెప్పారు. తెలంగాణ సమున్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అణగారిన వర్గాల సంక్షేమం, యువత ఆకాంక్షలు, వ్యక్తి స్వేచ్ఛకు విఘాతం కలిగితే గళం వినిపించే తెగువ తెలంగాణలో ఉంది. ఆ లక్షణం జనసేన శ్రేణుల్లోనూ నిండుగా ఉంది. ఘనమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద విలసిల్లే తెలంగాణ రాష్ట్రం సమున్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. తెలంగాణ కోసం బలిదానం చేసిన ప్రతి ఒక్కరికీ అంజలి ఘటిస్తున్నానని అన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగులేదు

మొదటి తరువాయి

మున్సిపల్ ఎన్నికల్లో మా సత్తా చూపించాం. జిల్లా పరిషత్ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించే అంశంపై ప్రభుత్వం చాలా బలంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రస్తుత తెలంగాణ మంత్రివర్గం రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక టీమ్‌లా అద్భుతంగా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం కొనియాడారు. అందరి లక్ష్యం తెలంగాణ అభివృద్ధి మాత్రమేనని, క్షేత్రస్థాయిలో పనిచేసే పార్టీలకు ఎలాంటి ఆర్భాటపు ప్రచారాలు అవసరం లేదని, ప్రజలకు సేవ చేయడమే తమ మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ , మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటుకుందని గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తాను వంద శాతం మార్కులు వేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇదే ఊపుతో రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలపై కూడా ప్రభుత్వం త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటుందని, 2028 లో జరిగే తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులే ఎవరూ లేరని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు, రాజకీయ పరిణామాలు , ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా అధికారులు పనిచేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకం అత్యంత అద్భుతంగా నడుస్తోందని, ప్రజలందరూ ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఈ పథకం సజావుగా సాగడం కోసం ప్రభుత్వం ప్రతి నెలా 150 కోట్ల నిధులను కేటాయిస్తోందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా పేదలకు 10 లక్షల వరకు వైద్య బీమా కవరేజ్ లభిస్తుందని, ప్రభుత్వంలో పూర్తి బాధ్యతాయుతమైన విధివిధానాలు ఉన్నాయని చెప్పారు. వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి వీలుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో కొత్తగా 10 వేల బెడ్‌లను పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ మీటర్లు పెట్టబోమని, ఉచిత కరెంట్ అందించి తీరుతామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడమే భవిష్యత్తులో తమ విజయానికి నిదర్శనమని భట్టి విక్రమార్క అన్నారు. అలాగే, సమాజంలో ఓట్ల గల్లంతు వ్యవహారంపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఓటర్ల మ్యాపింగ్ , అన్–మ్యాపింగ్ పక్రియలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న 'ఇందిరమ్మ జీవిత బీమా పథకం' రాష్ట్రంలోని లబ్దిదారులందరికీ ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. దేశంలో మొదటి నుండి గోదాములలో స్టాక్ ఉంచడం నేరమైనప్పటికీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం అదానీ, అంబానీ లాంటి పెద్ద కార్పొరేట్ సంస్థలకు గోదాములు పెట్టుకునేలా లబ్ది చేకూర్చిందని ఆరోపించారు. తెలంగాణ బీజేపీ నేతలు ఇక్కడ రాజకీయాలు మాట్లాడటం మానేసి.. కేంద్రం ద్వారా ముందుగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని, ఆ తర్వాతే ఇతర విషయాల గురించి మాట్లాడాలని డిప్యూటీ సీఎం గట్టిగా హితవు పలికారు.

# ఎంజేపీ గురుకులంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు




**పఠాన్ చెరు, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పఠాన్ చెరు మండలం చిన్నకంచర్ల గ్రామంలోని బీసీ గురుకుల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని గురుకుల ప్రిన్సిపాల్ బొల్లా స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, “తెలంగాణ కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు, అది కోట్లాది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. అమరుల త్యాగాల వల్లే తెలంగాణ నిర్మితమైంది” అని భావోద్వేగంగా పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేడుకలో తెలంగాణ ఉద్యమ గాథను స్మరించుకుంటూ, రాష్ట్ర అభివృద్ధి పథంలో గురుకుల విద్యార్థులు ముందుకు సాగాలని సంకల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఏటీపీ రేఖలక్ష్మి, దశరథ్తో పాటు అధ్యాపక బృందం సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

**-యాచారం మండలంలో ప్రొద్దుటూరి రవీందర్ గుప్తా సందేశం**

**యాచారం, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమకారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రొద్దుటూరి రవీందర్ గుప్తా, టీజేఏసీ రంగారెడ్డి జిల్లా తూర్పు డివిజన్ పూర్వ కో-కన్వీనర్, యాచారం మండలం మేడిపల్లి నక్కర్త, భావోద్వేగంగా స్పందించారు. “తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు, పోరాటమే స్వరాష్ట్ర సాధనకు పునాది. వారి ఆశయాలు నెరవేరాలని మనమంతా కృషి చేయాలి. జై తెలంగాణ!” అని ఆయన పేర్కొన్నారు.

## మర్రిగూడలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**-అమరుల త్యాగాలను స్మరించిన ప్రజా ప్రతినిధులు**





**మర్రిగూడ, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మర్రిగూడ మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో మంగళవారం వేడుకలు ఘనంగా జరిగాయి. మండల తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలలు, అలాగే బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించి, వారు చేసిన త్యాగాలను స్మరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో మున్నయ్య, ఎస్ఐ బి. రాంబాబు, వైద్యాధికారి డాక్టర్ శాలిని, బీఆర్ఎస్ నాయకులు చెరుకు శ్రీరామ్ గౌడ్, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్, కొలుకులపల్లి యాదయ్య, రాపోలు యాదగిరి, నల్ల శేఖర్, గౌస్, తెలంగాణ ఉద్యమకారుడు బురుగు నాగరాజు గుప్త, బీజేపీ నాయకులు రాజేందర్ నాయక్, శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ మాస నీలిమ, చంద్రశేఖర్, వెంకటంపేట బాలయ్య, రమావత్ శీను నాయక్, పొనుగోటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుని సోదరుడు మృతి

**-నివాళులర్పించిన మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి**



**నందికొట్కూరు, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ లాయర్ జాకిర్ హుసైన్ సోదరుడు మహబూబ్ బాష అనారోగ్య కారణంగా మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జమీల్, ఎల్లయ్య ఆచారి, గోవర్ధన గిరి, శ్రీకాంత్, రసూల్, మాబాష తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యమకారుల గుర్తింపులో
# న్యాయం, పారదర్శకత అవసరం


**సంగారెడ్డి, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో న్యాయం, పారదర్శకత తప్పనిసరి అని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) జిల్లా సమావేశం స్పష్టం చేసింది. మంగళవారం సంగారెడ్డి శాంతినగర్ ఉపాధ్యాయ భవనంలో టీపీజేఏసీ జిల్లా చైర్మన్ వై. అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ రంగాల ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రతిపాదనలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. జిల్లా, నియోజకవర్గ, మండల జేఏసీల ద్వారానే ఉద్యమకారుల గుర్తింపు జరగాలని, కేసులు లేని ‘ఫ్రంట్‌లైన్’ ఉద్యమకారులను న్యాయంగా గుర్తించాలని తీర్మానించారు. ఉద్యమ సమయంలో దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు, రైలు రోకోలు, సకల జనుల సమ్మె, సాగరహారం, సంసద్ యాత్ర, ధూమ్ ధామ్ వంటి కార్యక్రమాల్లో క్షేత్రస్థాయిలో పాల్గొన్న అసలైన ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, ఆర్టీసీ సమ్మె కార్మికులు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారులు, జర్నలిస్టులు, వికలాంగుల




నాయకత్వం వంటి అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తీర్మానించారు. నామినేటెడ్ పోస్టుల్లో ఉద్యమకారులకు కోటా కల్పించాలని, అమరవీరుల కుటుంబాలకు ఇండ్లు, ఉచిత విద్య, పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపబడిన ఉద్యమకారులకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం కోసం ప్రత్యేక హెల్త్ కార్డులు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నిరుపేద ఉద్యమకారులకు వన్-టైమ్ ఆర్థిక సహాయం అందించాలని సమావేశం కోరింది. సీమాంధ్ర ఆధిపత్యం ఇప్పటికీ కొనసాగుతోందని, ఉద్యమకారుల గుర్తింపు ఆలస్యం దానికి నిదర్శనమని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. పాలన తీరులో మార్పు రావాలని, తెలంగాణ ప్రజల కేంద్రంగా అభివృద్ధి నిలవాలని ఆకాంక్షించింది. ఈ సమావేశంలో టీపీజేఏసీ చైర్మన్ వై. అశోక్ కుమార్, కో చైర్మన్ ఎం. అనంతయ్య, కోఆర్డినేటర్ శ్రీధర్ మహేంద్ర, మహిళా ప్రతినిధులు ఆర్. లక్ష్మి, ఏ. మానస, శైలజ, పర్యావరణ ఉద్యమకారుడు ఎం. వినోద్ కుమార్, ఆర్టీసీ ఉద్యోగ నాయకులు నవాజ్, పల్లె కృష్ణమూర్తి, పోలీస్ ఉద్యమకారుడు బోర్గి సంజీవ్, అడ్వకేట్ నాయకులు సదానందం, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, బహుజన వేదిక నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. జూన్ 4న జరగబోయే రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, త్వరగతిన జీవో విడుదల చేయాలని టీపీజేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

# స్వరాష్ట్రం కోసం పోరాటం గర్వం

**-తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కప్పాటి పాండురంగారెడ్డి సందేశం**



**రంగారెడ్డి, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రం అహింసాయుత మార్గంలో, ప్రజాస్వామ్య పద్ధతిలో సాధించబడిన అత్యంత ప్రతిష్టాత్మక రాష్ట్రమని, నేడు దేశంలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ చైర్మన్, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుడిగా ఈ వేడుకల్లో భాగస్వామి కావడం తనకు గర్వకారణమని ఆయన భావోద్వేగంగా తెలిపారు. 2001 ఏప్రిల్ 27న ఊపిరి పోసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ద్వారా మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనే అవకాశం దక్కిందని, కందుకూరు మండల మొదటి పార్టీ కన్వీనర్‌గా, మండల అధ్యక్షుడిగా, జిల్లా కార్యవర్గ సభ్యునిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్‌గా, రాజకీయ జేఏసీ అధికార ప్రతినిధిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఉద్యమ నాయకులతో కలిసి నడిచిన అనుభవం తన జీవితంలో గొప్పదని ఆయన గుర్తుచేశారు. 14 సంవత్సరాల పాటు సాగిన శాంతియుత పోరాటం ప్రపంచానికే ఆదర్శమని, ఎన్నో అమరవీరుల ఆత్మబలిదానాలు, ఉద్యమకారుల పోరాటాలు, అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం, రాజకీయ జేఏసీ తోడ్పాటుతో తెలంగాణ ప్రజల దశాబ్దాల కల 2014 జూన్ 2న సాకారమైందని ఆయన వివరించారు. ఉద్యమం అనంతరం రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సేవలు అందించే అవకాశం రావడం, నేడు 12వ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో గర్వంగా పాల్గొనడం తన జీవితంలో అత్యంత గొప్ప అనుభూతి అని పాండురంగారెడ్డి పేర్కొన్నారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ మరింత ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

# రైతులకు సరైన సూచనలు ఇవ్వాలి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఎక్కువగా డీలర్లను నమ్ముతారని, అందువల్ల వారికి సరైన సలహాలు ఇవ్వడం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్‌పుట్ డీలర్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 48 వారాల పాటు 40 మంది డీలర్లకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన కేంద్రాల సందర్శనలతో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని, వాతావరణ పరిస్థితులు, అంచనాలను వివరించాలని సూచించారు. రైతు వేదికల్లో జరిగే సమావేశాలకు హాజరై అవగాహన కల్పించాలని, నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన ఎరువులు విక్రయించరాదని హెచ్చరించారు. శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన 36 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కెవికె శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


తాసిల్దార్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న యాకన్నా


నారాయణ పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో రంగు లత శ్రీనివాస్ గౌడ్.


రాకలదేవ్ పల్లి గ్రామపంచాయతీలో మద్దెల రమాదేవి సంపత్

**-ఎలిగేడు మండలంలో జాతీయ జెండా ఆవిష్కరణ**

**ఎలిగేడు, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని గ్రామాలన్నింటిలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కర్ రావు, ఏవో ఉమాపతి, ఏపీఎం గీత, ఎంఈవో నరేంద్రచారి తమ తమ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో హెడ్‌మాస్టర్లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో సర్పంచులు కప్పల ప్రవీణ్, రంగు లత శ్రీనివాస్ గౌడ్, రాధ గంగా జమున, వెంకట్ రెడ్డి, కొమురయ్య, వెంకటేశ్ గౌడ్, వాణి, గోపు రజిత-లక్ష్మారెడ్డి, బాపయ్య, రమాదేవి, తిరుపతి యాదవ్ పాల్గొన్నారు. ఉపసర్పంచులు ముంజం నరేష్, కొత్తిరెడ్డి బాపురెడ్డి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు.


ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భాస్కరరావు


ఎలిగేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో కప్పల ప్రవీణ్

# లెంకలపల్లిలో ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్

**--మానవత్వాన్ని చాటుకున్న అయితగోని పద్మ వెంకటయ్య గౌడ్**



**మర్రిగూడ, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లెంకలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బరిగల యాదమ్మ అనారోగ్యంతో మరణించడంతో, వారి కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ అయితగోని పద్మ వెంకటయ్య గౌడ్ రూ.10,000 ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామ ప్రజల సమస్యలు, కష్టసమయాల్లో వారికి తోడుగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత. యాదమ్మ కుటుంబానికి ఈ సహాయం కొంత ఉపశమనం కలిగించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేతరి శంకర్, వార్డు సభ్యులు బరిగల గణేష్, దామెర మేఘన, మల్లేష్, బుర్కల లక్ష్మయ్య, గ్రామంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

**-తెలంగాణ అమరులకు నివాళులు**


జెండా ఆవిష్కరిస్తున్న బి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రామ్ రెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులు.




తెలంగాణ గీతం ఆలపిస్తూ

**ఎలిగేడు, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంతోపాటు గ్రామాలన్నింటిలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరుల చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రత్యేక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాటం ద్వారా సాధించారని, సాధించిన రాష్ట్రంలో పేదలు, రైతుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని నాయకులు గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని వారు విమర్శించారు. మరోసారి రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని, వచ్చే రెండేళ్లలో ఆయన మళ్లీ సీఎం అవుతారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి-మోహన్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సుల్తానాపూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, మాజీ సర్పంచులు రాచర్ల కొండయ్య, తంగెళ్ల స్వప్న కుమార్, నాయకులు న్యాతరి పోచాలు, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి రాజేష్, బోయిని సత్యం, కవ్వంపల్లి నారాయణ, ఇరు గురాల సది, గొల్ల లక్ష్మణ్, విద్యార్థి సంఘం నాయకుడు బాసంపెల్లి వినోద్తో పాటు వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో సమగ్రాభివృద్ధి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా సాగుతోందని, నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా దేశంలోనే కాకుండా ప్రపంచంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 'తెలంగాణ రైసింగ్ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇప్పటికే పేద ప్రజలకు మేలు చేసే పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గృహజ్యోతి, తదితర పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, తాళ్ళ రవీందర్, సంపత్, నరేష్, అజీమ్, అంజయ్య గుప్తా, జంగయ్య గౌడ్, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్, నాయకులు గుర్రం కేశవులు, కృష్ణ నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సురేష్, రాజు, అబ్దుల్ అలీమ్, బాబా, శ్రీపాల్, వస్పుల శ్రీకాంత్, ఎండి ఫరీద్, ప్రసాద్, మహేష్, కొండల్ రెడ్డి, రహీం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే తలమానికంగా రేవంత్ పాలన

**- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా**



**ఆమనగల్లు, జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పదేళ్లలో విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుకుంటూ ఆ ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ దేశానికే తలమానికంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన అందిస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనేకమంది త్యాగాల ఫలితమే రాష్ట్రం ఏర్పడిందని వారి బలిదానాలను సోనియా గాంధీ గుర్తించి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, తాళ్ళ రవీందర్, సంపత్, నరేష్, అజీమ్, అంజయ్య గుప్తా, జంగయ్య గౌడ్, కండె పాండురంగయ్య, యాదయ్య శ్యాంసుందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్, నాయకులు గుర్రం కేశవులు, కృష్ణ నాయక్, ధనుంజయ, అవ్వారి శివలింగం, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గాజుల సురేష్, అందేకార్ రాజు, అబ్దుల్ అలీమ్, బాబా, శ్రీపాల్, వస్పుల శ్రీకాంత్, ఎండి ఫరీద్, సురేష్ నాయక్, ప్రసాద్, మహేష్, విజయ్ నాయక్, కొండల్ రెడ్డి, రహీం, రఫీ, కుమార్ గౌడ్, మైసయ్య, వెంకటేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కృషితోనే తెలంగాణ సాకారం


**- సీనియర్ నాయకులు అర్జున్ రావు**



**ఆమనగల్లు, జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాటం ఫలితంగానే తెలంగాణ కల సాకారమైందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోనుగోటీ అర్జున్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీశైలం హైద్రాబాద్ జాతీయ రహదారిపై జాతీయ జెండా, పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఎనలేని అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టించారన్నారు. ఆయన హయాంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవించారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎనుమల్ల రమేష్, దుడ్డు ఆంజనేయులు యాదవ్, అనూష శ్రీశైలం, ఎంగలి భాగ్యమ్మ రఘు, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి, వంకేశ్వరం భీమయ్య, వస్పుల సాయిలు, అనంతుల సైదులు గౌడ్, కమటం వెంకటయ్య, ధోనాదుల కుమార్, ఉప్పల రాములు, వడ్డేమోని శివకుమార్, కొమ్ము ప్రసాద్, జంతుక కిరణ్, పంతు నాయక్, గణేష్, రమేష్ నాయక్, తోట కృష్ణ, సాలయ్య, జంగయ్య, ఎంగలి శ్రీధర్, మహేష్, గుజ్జరి గోపి, లందం యాదయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొండారెడ్డిపల్లి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**-ఇద్దరు యువకులు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు**



**కల్వకుర్తి, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గేటు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరోకరు తీవ్రంగా గాయపడ్డారు. వంగూర్ మండలానికి చెందిన బాలు (29), ప్రవీణ్ (27), రాజు (26) కల్వకుర్తి నుండి షిఫ్ట్ డిజైర్ కారు (టూ31టూ4081)లో బయలుదేరారు. కొండారెడ్డిపల్లి గేటు వద్దకు చేరుకున్న సమయంలో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో బాలు, ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందారు. రాజును తీవ్ర గాయాలతో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని ఎస్సై కురుమూర్తి తెలిపారు.

## అమరవీరుల త్యాగాల స్మరణతో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**ఆమనగల్లు, జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి అరుణ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం న్యాయవాదుల కలిసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అమరవీరులు చేసిన త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారికి నివాళులర్పించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్, ఉపాధ్యక్షులు శేఖర్, కోశాధికారి మల్లేష్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు సర్దార్ నాయక్, సీనియర్ న్యాయవాదులు మల్లేపల్లి జగన్, దుడ్డు ఆంజనేయులు, న్యాయవాదులు రామకృష్ణ, మల్లేష్, జగన్ గౌడ్, మల్లేష్, ఆంజనేయులు, శిరీష్ కుమార్, శ్రీశైలం, రమేష్, శ్రీనివాస్, మహేశ్వర్, శివశంకర్, కోర్టు సూపరిండెంట్ మురళీధర్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

## అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫాం పంపిణీ



**ఆమనగల్లు, జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే చిన్నారులకు క్రమశిక్షణ, పాఠశాల వాతావరణంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సంకటోనిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు కన్నతల్లి తర్వాత అంగన్‌వాడీ టీచరే తల్లి వంటి వారన్నారు. వారిని ప్రేమగా చూసుకుంటూ ప్రాథమిక విద్యను అందించడంలో టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలని, చిన్నతనం నుంచే బడికి వెళ్లడం అలవాటు చేసుకోవాలనే సదుద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణ, చక్కటి నడవడిక నేర్పించే విషయంలో అంగన్‌వాడీ టీచర్లు మరింత బాధ్యతగా వ్యవహరించాలని వారు సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కమటం రాధామ్మ వెంకటయ్య, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మమ్మ, శ్రీదేవి, మంజుల మరియు గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువగా ఉండాలి

**- ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు**



**ఆమనగల్లు, జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పోలీసులు బాధ్యతతో పనిచేసి ప్రజలకు మరింత చేరువగా ఉండాలని ఎస్. హెచ్. ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణ కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. హెచ్. ఓ వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. పోలీసులు వృత్తినే దైవంగా భావించి పనిచేయాలన్నారు. సమాజంలో ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో కీలక భూమిక పోషించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీతారాం రెడ్డి, ఏఎస్ఐ రాంరెడ్డి మరియు పోలీస్ సిబ్బంది ప్రవీణ్, శంకర్, మల్లేష్, గోవర్ధన్, జగన్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ సభ్యుడిగా ఎండి ఆసిఫ్ అలీ



**ఆమనగల్లు,జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర రెండవ ఆర్థిక సంఘంలో ప్రింటింగ్, స్టేషనరీ అండ్ స్టోర్స్ పర్చేజ్ డిపార్ట్‌మెంట్ (ప్రింటింగ్ వింగ్) కమిషన్ సభ్యుడిగా ఎం.డి. ఆసిఫ్ అలీ నియమితులయ్యారు. ఈ బాధ్యతలతో ప్రభుత్వ ముద్రణ, స్టేషనరీ, స్టోర్స్ కొనుగోలు వ్యవహారాల నిర్వహణలో కీలక పాత్ర పోషించనున్నారు. ఆయన నియామకంపై పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, మిత్రులు అభినందనలు తెలియజేస్తూ, ప్రజా సేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఈనెల 13న జాతీయ లోక్‌అదాలత్



**ఆమనగల్లు,జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు కోర్టులో జూన్ 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం మంగళవారం న్యాయ మేజిస్ట్రేట్ అరుణ్ కుమార్ నారం అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల్, మడ్గుల, తలకొండపల్లి పోలీస్ అధికారులు, ఎక్సైజ్ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. రాజీ పడదగ్గ, పెండింగ్ పీటీ కేసులను గుర్తించి, లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## జూన్ 6, 7న యునైటెడ్ కరీంనగర్ జిల్లా చెస్ ఛాంపియన్‌షిప్-2026

**కరీంనగర్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ చెస్ అసోసియేషన్ వారు అండర్-9 మరియు అండర్-13 బాలురు, బాలికల చెస్ ఛాంపియన్‌షిప్‌ను జూన్ 6, 7 తేదీల్లో భగత్‌నగర్ చైతన్య క్లబ్‌లో నిర్వహించనున్నారు.కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల రాజన్న, సిద్దిపేట జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చు. ప్రతి విభాగంలో టాప్-4 ఆటగాళ్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారు.ఎంట్రీ ఫీజు ?300/-గా నిర్ణయించబడింది. అండర్-9 రిజిస్ట్రేషన్ చివరి తేదీ జూన్ 5, అండర్-13 కోసం జూన్ 6. ఉదయం 10 గంటలకు రిపోర్టింగ్, సాయంత్రం 6:30 గంటలకు బహుమతి ప్రదానం జరుగుతుంది అని నిర్వాహకులు తెలిపారు.

## ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో ప్రవేశాల ప్రారంభం



**తిప్పర్తి ,జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తిప్పర్తి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి మరియు ఇంటర్మీడియట్ ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రవేశాలు పొందదలచిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎ.అపర్ణ కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని ఆధునిక సౌకర్యాలు సంస్థలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సువిశాలమైన క్రీడా ప్రాంగణం, డిజిటల్ క్లాస్‌రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్స్, లాంగ్వేజ్ ల్యాబ్స్ కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా ఆధునిక తరగతి గదులు, అనుభవజ్ఞులైన విషయ నిపుణులైన అధ్యాపక బృందం విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేస్తోందని ఇంటర్మీడియట్ చదివే బాలికల కోసం అన్ని సౌకర్యాలతో కూడిన సురక్షితమైన హాస్టల్ వసతి కూడా కల్పించామని తెలిపారు.విద్యా ఫలితాలలోనూ సంస్థ విశేష విజయాలు సాధిస్తోందని, ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో పాటు, పదో తరగతి ఫలితాలలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారని వెల్లడించారు.నేటి పోటీ ప్రపంచానికి విద్యార్థులను సంసిద్ధులను చేయడానికి ప్రముఖ ఆన్‌లైన్ విద్యా వేదికలైన ఫిజిక్స్ వాలా , ఖాన్ అకాడమీ తరగతులను కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచి, సాంకేతిక ఆధారిత విద్యను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.6వ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందదలచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నేరుగా పాఠశాలను సంప్రదించి ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.


## ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరణ




**అమనగల్లు, జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమనగల్లు ఎంపీడీవో గా జీ. జయరాం విజయ్ బాధ్యతలు మంగళవారం స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కుసుమ మాధురి.. కొంత కాలం క్రితం వికారాబాద్ జిల్లా డీ.ఆర్.డీఓ విజిలెన్స్ అధికారిగా పదోన్నతిపై వెళ్లారు. దీంతో నాటి నుంచి తలకొండపల్లి ఎంపీడీఓ శ్రీకాంత్ ఇన్చార్జిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం నల్గొండ జిల్లా నేరెడుగొమ్ము మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న జయరాం విజయ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని, మండలంలో పారిశుద్ధ్య నిర్వహణ, పంచాయితీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు.నూతన ఎంపీడీఓ జైరామ్ విజయ్ ను సన్మానించిన ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్

అమనగల్లు మండల నూతన ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన జైరామ్ విజయ్ ను మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ని కలిసి శాలువా కప్పి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ అంబర్ సింగ్, నాయకుల హరిలాల్ తదితరులు ఉన్నారు.

## నూతన ఎంపీడీవో ను సన్మానించిన జగన్



**ఆమనగల్లు, జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండల ప్రజా పరిషత్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో జైరామ్ విజయ్ ను మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి ఎంపీడీవోను అభినందించారు. మండల అభివృద్ధికి సహకరించాలని, వివిధ గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి, తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని జగన్ కోరారు. ఆయన వెంట ఉప సర్పంచ్ సురేష్ నాయక్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, శేఖర్ గౌడ్, దేవరశెట్టి మహేష్ తదితరులు ఉన్నారు.

## బోడుప్పల్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు




**బోడుప్పల్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఎంతో మంది తెలంగాణ అమరవీరుల త్యాగాలు, విద్యార్థుల బలిదానాల ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన. వారి ఆశయాలు నెరవేరేలా మనందరం కృషి చేయాలి" అని పేర్కొన్నారు.వేడుకల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, మాజీ మేయర్లు సామల బుచ్చిరెడ్డి, తోటకూర అజయ్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు, ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమితులైన రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ



**కల్వకుర్తి, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమితులైన రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీని కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దళపతి గౌడ్, వైస్ ప్రెసిడెంట్ మొహ్మద్ ఇమ్రాన్ బాబా, తలకొండపల్లి మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేష్, ఇర్వేన్ బావుండ్లపల్లి సర్పంచ్, వప్పుగూడ ఉప సర్పంచ్ కిరణ్, మాజీ సర్పంచ్ రాము, సుధాకర్ గౌడ్, అజార్ అలీ, క్యామా రాజేష్, రాజు, శ్రీను నాయక్, చెందు, శివ తదితర కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "ఆసిఫ్ అలీ నియామకం కాంగ్రెస్ పార్టీకి గర్వకారణం. ఆయన అనుభవం, కృషి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత బలాన్ని చేకూరుస్తుంది" అని అభిప్రాయపడ్డారు.

# అమర వీరుల త్యాగాల ఫలమే నేటి తెలంగాణ

**నల్లగొండలో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు**

**నల్లగొండ, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ పోలీస్ పరేడ్ మైదానంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఎందరో అమరుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ. సోనియా గాంధీ చూపిన తెగువతోనే రాష్ట్రం ఏర్పడింది. జూన్ 2 మనందరికీ పండుగ రోజు" అని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో నల్లగొండ జిల్లా విప్లవ పోరాటాల పురిటిగడ్డగా నిలిచిందని, మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, సుద్దాల హనుమంతు, భీమిరెడ్డి నరసింహారెడ్డి వంటి వీరులు రజాకార్లపై తిరగబడ్డ చరిత్రను స్మరించారు. మలిదశ ఉద్యమంలోనూ నల్లగొండ కీలక పాత్ర పోషించిందని, శ్రీకాంతాచారి వంటి యువకులు ప్రాణత్యాగం చేస్తుంటే తాను కూడా మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్నానని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో ముందుకు సాగుతోందని తెలిపారు. "ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో



సాధించిన విజయాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాల ద్వారా 508.85 కోట్ల లబ్ధి, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ద్వారా 44.12 కోట్ల ప్రయోజనం, 489 కేంద్రాల ద్వారా 7.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ వంటి విజయాలను ప్రస్తావించారు. రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీస్ శాఖ కృషిని అభినందించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, స్థానిక కార్పొరేటర్ కవిత, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ
## ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






















**కల్వకుర్తి/వంగూరు/తలకొండపల్లి/అచ్చంపేట/వెల్దండ , జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కల్వకుర్తి, వంగూర్, తలకొండపల్లి, అచ్చంపేట, వెల్దండ మండలాలతో పాటు వృద్ధాశ్రమాలు, పార్టీ కార్యాలయాలు, ప్రజా ప్రాంగణాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. కల్వకుర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబిదేవ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించి, తెలంగాణ సాధనలో పార్టీ పాత్రను గుర్తుచేశారు. వంగూర్ మండల కేంద్రంలో సర్పంచ్ పి. యాదయ్య ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కల్వకుర్తి వృద్ధాశ్రమంలో నిర్వాహకులు పెరుమాళ్ల వెంకటయ్య వృద్ధులతో కలిసి జెండా ఆవిష్కరించి పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. తలకొండపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ చరిత్రను స్మరించారు. అచ్చంపేట పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ వివిధ ప్రాంగణాల్లో జెండా ఆవిష్కరించి అమరవీరుల త్యాగాలను స్మరించారు. వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామంలో సర్పంచ్ కొండల్ యాదవ్ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది కలిసి పూడికతీత పనులను పరిశీలించారు. కల్వకుర్తి పట్టణంలో మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరుల స్థూపానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. వెల్దండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహభరితంగా జరుపుకున్నారు.

# వర్షాలు ఆలస్యం.. జూన్ 4న కేరళకు నైరుతీ

**న్యూఢిల్లీ: , జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వర్షాలు ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. నైరుతీ రుతుపవనాలు జూన్ 4వ తేదీ నాటిని కేరళను తాకే అవకాశాలు ఉన్నాయని భారతీయ వాతావరణ శాఖ తెలిపింది. సాధారణంగా జూన్ ఒకటో తేదీ నాటికి నైరుతి కేరళను తాకుతుంది. దీంతో వర్షాకాలం మొదలవుతుంది. అయితే ప్రస్తుతం మబ్బుల రాక ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. జూన్ 4వ తేదీ




వరకు కేరళ, తమిళనాడు, అరేబియా సముద్రం, లక్షద్వీప్‌తో పాటు మరికొన్ని ప్రాంతాలకు నైరుతి చేరుకునే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది. మే 26వ తేదీ వరకు నైరుతి రానున్నట్లు గతంలో ఐఎండీ చెప్పిన విషయం తెలిసిందే. కానీ నైరుతి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో మే 29వ తేదీన కొత్త అప్‌డేట్ ఇచ్చారు. ఈసారి వానాకాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కన్నా తక్కువ స్థాయిలో వర్షాలు ఉంటాయని గత వారం ఐఎండీ పేర్కొన్న విషయం తెలిసిందే.

## బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**నల్లగొండ ,జూన్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ చేతుల మీదుగా నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలతో సాధించిన తెలంగాణను బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సస్యశ్యామలం చేశామని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రానికి నష్టం జరుగుతోందని ఆరోపించార తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు తెలంగాణ తల్లి సాక్షిగా కార్యకర్తలు,ఉద్యమకారులతో ప్రతిజ్ఞ చేయించారు అమరవీరుల స్మారక స్థూపం, శ్రీకాంతాచారి విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహాలకు నివాళులు అర్పించారునాట్య ప్రదర్శనలు, యోగా విన్యాసాలు ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం కళాకారులు, యోగా బృంద సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు,మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, దేవరకొండ, నల్లగొండ, నకిరేకల్ మాజీ, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కార్పొరేటర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ**



**కనగల్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని ధర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఇప్పటికే కళ్యాణ మండపం, వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టామని, రూ.50 కోట్లతో నల్గొండ--ధర్వేశిపురం రహదారి నిర్మాణం, రూ.239 కోట్లతో గుర్రంపోడు--కొండమల్లేపల్లి--దేవరకొండ--డిండి వరకు ఫోర్ లేన్ రహదారి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రిని ధర్వేశిపురానికి తీసుకువచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. నూతన ధర్మకర్తల మండలి చైర్మన్ సిహెచ్. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించారని, ఇప్పటికే ఐదు కోట్లతో పనులు పూర్తయ్యాయని, మిగతా నిధులతో ఆలయ పునర్నిర్మాణం చేపడతామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రం, పాఠశాల రహదారి మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, డిఎస్పీ శివరాం రెడ్డి, ఎండోమెంట్ అధికారులు, తహసిల్దార్ పద్మ, ఆలయ ఈవో అంబటి నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం అనూప్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా

**షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అకస్మిక తనిఖీ చేసిన కమిషనర్ తరుణ్ జోషి**




**షాద్‌నగర్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి మంగళవారం షాద్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల దర్యాప్తు, నివారణాత్మక పోలీసింగ్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను పరిశీలించిన ఆయన, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, నేర గణాంకాలు, ప్రజా వినతుల పరిష్కారం, శాఖాపరమైన కార్యక్రమాల అమలును సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ, "ప్రజల ఫిర్యాదులకు తక్షణ స్పందన ఇవ్వాలి. క్రిమినల్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు జరగాలి. బీట్ పోలీసింగ్‌ను బలోపేతం చేసి ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలి" అని సూచించారు. గ్రామ పోలీసు అధికారులు, విపిఓలు గ్రామాల్లో సమాచార సేకరణను చురుకుగా నిర్వహించి, అనుమానాస్పద కదలికలను వెంటనే నివేదించాలని ఆదేశించారు. తెలిసిన నేరస్థులు, రౌడీ షీటర్లు, అలవాటు నేరస్థులు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు, సైబర్ నేరాలు, జూదం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంలో షాద్‌నగర్ జోన్ డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ సీతారాం, ట్రాఫిక్ సీఐ శంకరయ్య, ఎస్సైలు సుశీల, శ్రీకాంత్ నాయక్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
బుధవారం 3 జూన్ 2026

# ఇంటి స్ధలం పై కన్ను

- ఆవేదనలో నిరుపేద కుటుంబం

-నందికొట్కూరులో కలకలం రేపిన ఘటన








**నందికొట్కూరు, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు పట్టణంలోని ఐదో వార్డులో ఒక నిరుపేద కుటుంబం తమ ఇంటి స్థలం కబ్జాకు గురైందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్య యత్నానికి దిగింది. వివరాల ప్రకారం, పట్టాదారుడు బొందిలి శేష సింగ్ తల్లి సుభద్రమ్మ మూడు సెంట్ల స్థలంపై స్థానిక టిడిపి నాయకుడు కన్నేశాడని ఆరోపిస్తూ, పురుగుల మందు సీసా పట్టుకుని, పెట్రోల్ పోసుకొని అంటించుకుంటామంటూ స్థలంలోనే బైఠాయించారు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ పత్రాలు చేతబట్టి కన్నీటి పర్యంతమై తమ స్థలం మాకు దక్కకపోతే ప్రాణాలు తీసుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆత్మహత్య యత్నాన్ని అడ్డుకున్నారు. అయితే, "మాకు న్యాయం జరగకపోతే మరణమే శరణం" అని బాధితులు మీడియా ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి పనుల్లో ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్

-శ్రామికుల సమస్యలపై ఆవేదన వ్యక్తం చేసిన సీపీఐ(ఎంఎల్) లిబరేషన్



**నంద్యాల, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ ఉపాధి హామీ శ్రామికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామ శివార్లలో ఉపాధి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, "ఫేస్ యాప్ వల్ల నెట్ లేకపోవడంతో శ్రామికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి" అని డిమాండ్ చేశారు. అలాగే, ప్రతి శ్రామికునికి రోజువారీ కూలీ కనీసం రూ.600 ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, వేసవి అలవెన్స్ 30% కలపాలని, పని చేసే చోట మజ్జిగ, మెడికల్ కిట్లు, రవాణా చార్జీలు అందించాలని సూచించారు. 100 రోజులు పని చేసిన వారికి పనిముట్లు ఉచితంగా పంపిణీ చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామికులు శ్రీనివాసులు రాజు, ఇమ్మానియేలు, వెంకటయ్య, సరోజమ్మ, దేవమ్మ, లక్ష్మీ, జయలక్ష్మి, సుశీల, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై అవగాహన సదస్సు

తల్లిదండ్రులే కీలక పాత్ర పోషించాలి -- ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటేశ్వరమ్మ



**నందికొట్కూరు, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను గ్రామ అంగన్వాడీ కేంద్రం సెంటర్--2లో మంగళవారం బాల్యవివాహాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ, "పిల్లల భవిష్యత్తు దృష్టిలో తల్లిదండ్రులు బాల్యవివాహాలను అరికట్టాలి. ప్రతి బాలికకు విద్య, ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తు కల్పించడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు. బాల్యవివాహాలు బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వారి ఆశయాల సాధనకు తల్లిదండ్రులు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లలితమ్మ, ఇందిరమ్మ, వెంకటరమణమ్మ, బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేటి రాశి ఫలితాలు





**మేషరాశి**
దూర ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా పడతాయి. బంధువులతో అకారణంగా విభేదాలు కలుగుతాయి. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపార, ఉద్యోగాలలో పని ఒత్తిడి తప్పదు. గురువు నామస్మరణ శుభకరం.

వృషభరాశి
ఆదాయం మరింత పెరుగుతుంది. రాజకీయ వర్గాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. పంచాక్షరి మంత్రం స్మరణ శుభకరం

మిధునరాశి
విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. నూతన వాహన యోగం ఉన్నది. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. అధికారులతో చర్చలు ఫలిస్తాయి. వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో అవరోధాలు అధిగమిస్తారు. శ్రీరామ నామస్మరణ శుభకరం.

కర్కాటకరాశి
ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో విభేదాలు కలుగుతాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. పనుల్లో కొద్దిపాటి ఆటంకాలు కలుగుతాయి. వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడులు పెరుగుతాయి. నవగ్రహాల స్మరణ శుభకరం

సింహరాశి
బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. రాబడికి మించి ఖర్చులు ఉంటాయి. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు విశ్రాంతి లేకుండా చేస్తాయి. సీతారాముల నామస్మరణ శుభకరం.

**కన్యరాశి**
విద్యార్థులకు పరీక్ష ఫలితాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. మొండి బాకీలు వసూలవుతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. సన్నిహితుల నుండి కొత్త విషయాలు తెలుసుకుంటారు. వ్యాపారాలలో అధిక లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో సమస్యలు తీరి ఊరట చెందుతారు. నవగ్రహ స్తోత్రం శుభకరం.

**తులరాశి**
కుటుంబ సమస్యలు మరింత చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. మిత్రులతో విభేదాలు కలుగుతాయి. నూతన ఋణాలు చేస్తారు. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది.
విష్ణు నామ స్మరణ శుభకరం.

**వృశ్చికరాశి**
అందరిలోనూ మీ విలువ పెరుగుతుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. దూరపు బంధువుల నుండి శుభవర్తమానాలు అందుతాయి. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. గణపతి నామస్మరణ శుభకరం

**ధనస్సురాశి**
కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రయాణాలు వాయిదా వేస్తారు. బంధువులతో మాట పట్టింపులు ఉంటాయి. ముఖ్యమైన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఉంటాయి. హనుమాన్ నామస్మరణ శుభకరం.

**మకరరాశి**
ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలలో లాభాలు అందుతాయి. పనులు సజావుగా సాగుతాయి. ఆప్తుల నుండి విలువైన విషయాలు సేకరిస్తారు. ఉద్యోగుల కలలు సహకారం అవుతాయి. గురు నామస్మరణ శుభకరం.

**కుంభరాశి**
ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. బంధువులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. చేపట్టిన పనులలో ప్రయత్నకార్యసిద్ధి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. కుమారస్వామి నామస్మరణ శుభకరం.

**మీనరాశి**
మిత్రులతో అకారణంగా విభేదాలు కలుగుతాయి. వ్యాపారాలలో కష్టానికి ఫలితం కనిపించదు. సోదరులతో ఆస్తి వివాదాలు కలుగుతాయి. పని ఒత్తిడి అధికమవుతుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు మరింత చికాకు కలిగిస్తాయి. లక్ష్మీ వెంకటేశ్వర నామస్మరణ శుభకరం.

**(నిపుణుల సలహాలతో రాశి ఫలాలను పరిగణంలోకి తీసుకోండి )**

**శ్రీ కాలభైరవపాసకులు**

**దక్క జంబులయ్య**

**9491163914**



## 57వ డివిజన్ గణేష్ నగర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ, పైప్‌లైన్ మరమ్మత్తులు



**కరీంనగర్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గణేష్ నగర్‌లోని సిరి ఫంక్షన్ హాల్‌లో 57వ డివిజన్ మహిళా సంఘాల జనరల్ బాడీ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులకు ప్రభుత్వం అందించే ఇందిరమ్మ చీరలను కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ--శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సమావేశంలో సిఓ సునీత, ఆర్‌పి జ్యోతి శంకరమ్మతో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ, కార్పొరేటర్ రమ్యశ్రీ--శ్రీనివాస్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ డ్రైనేజీ సమస్యలు, పింఛన్లు, ఇంటింటి మంచినీటి పైప్‌లైన్ లీకేజీ మరమ్మత్తులు దగ్గరుండి పరిష్కరిస్తున్నారని తెలిపారు. మలేరియా, డెంగ్యూ వంటి దోమల సమస్యలు తావు లేకుండా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండి అండగా నిలుస్తున్నారని డివిజన్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో కార్పొరేటర్ కృషి స్థానికులకు ఉపశమనం కలిగించింది.

## ఎల్లమ్మ చెరువులో ఈతకు వెళ్లిన యువకుడు మృతి



**హుస్నాబాద్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా పచ్చునూర్ గ్రామానికి చెందిన దాసారపు కార్తీక్ (యువకుడు) ఎల్లమ్మ చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. సమాచారం ప్రకారం, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనుల నిమిత్తం హుస్నాబాద్‌కు వచ్చిన కార్తీక్ మంగళవారం స్నేహితులతో కలిసి చెరువులోకి దిగాడు. నీటి లోతు ఎక్కువగా ఉండటంతో అతను మునిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. గ్రామంలో ఈ ఘటన విషాదాన్ని మిగిల్చింది.

## పోగొట్టుకున్న ఫోన్ తిరిగి బాధితునికి అందజేత




**గన్నేరువరం, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జంగపల్లి గ్రామానికి చెందిన రాజేంద్ర ప్రసాద్ భార్య సంగెం వనజ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను పోలీసులు సిఇఐఆర్ టెక్నాలజీ సహాయంతో స్వాధీనం చేసుకుని తిరిగి అందజేశారు. గన్నేరువరం పోలీస్ కానిస్టేబుల్ సాయి ప్రేమ్ ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను వెబ్‌సైట్‌లో నమోదు చేసి బ్లాక్ చేయగా, ఆ ఫోన్ వెస్ట్ బెంగాల్‌లో ఒక వ్యక్తి వద్ద ట్రేస్ అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, సిఇఐఆర్ టెక్నాలజీ ద్వారా పోగొట్టుకున్న ఫోన్లను సులభంగా గుర్తించి తిరిగి యజమానులకు అందజేయవచ్చని తెలిపారు. పోలీసుల కృషి పట్ల బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

## సైబర్ నేరాలు,మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు



**పెద్దపల్లి, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దబొంకూర్ గ్రామంలో పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆస్తి సంబంధిత నేరాలు, సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మి వ్యక్తిగత, బ్యాంకు వివరాలు పంచుకోవద్దని సూచించారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.కార్యక్రమం అనంతరం వాహనాల తనిఖీలు జరిపి, సరైన పత్రాలు లేని 6 ఆటోలు, 34 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు.గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని పోలీసులు స్పష్టం చేశారు.

## ఈహెచ్‌ఎస్ కార్డులపై ఉపాధ్యాయుల నిరసన


**కరీంనగర్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



త్వరలో ప్రభుత్వం అందించబోతున్న ఈహెచ్‌ఎస్ కార్డులపై ఉపాధ్యాయులకు అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎస్జీటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఊకంటి విజేందర్ రెడ్డి, గడప శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈహెచ్‌ఎస్ పథకం హడావుడిగా కాకుండా ప్రతి ఉపాధ్యాయునికి స్పష్టమైన క్లారిటీ ఇవ్వాలని వారు కోరారు. గతంలో ఉన్న ఈహెచ్‌ఎస్ వలె కాకుండా వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందాలని, హాస్పిటల్స్‌తో ఉన్న ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని, గరిష్ట రీయింబర్స్మెంట్, వ్యాధుల రకాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఒక కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగంలో ఉన్నప్పుడు ఒకరికి మాత్రమే జీతం నుండి ఈహెచ్‌ఎస్ అమౌంట్ డిడక్షన్ చేయాలని, 25 సంవత్సరాల వయసు నిబంధనను 30 సంవత్సరాలకు పెంచాలని సూచించారు. సిపిఎస్ ఉద్యోగులకు కూడా పూర్తి క్లారిటీ ఇవ్వాలని కోరారు.ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలతో పోలిస్తే ప్రభుత్వ ఈహెచ్‌ఎస్ పథకం ఏ విధంగా మెరుగైనదో ఉపాధ్యాయులకు వివరించాలని వారు డిమాండ్ చేశారు. కీలకమైన ఉద్యోగుల సమస్యల చర్చల సమయంలో అన్ని సంఘాలను పిలవాలని, మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పిఆర్సి, డీఏలను ప్రకటించాలని కూడా కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శాంతికిరణ్, చంద్రారెడ్డి, ఆంజనేయులు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.ఉపాధ్యాయుల అనుమానాలకు ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని సంఘాలు స్పష్టం చేశాయి.

### నూతన ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించిన వి.సురేందర్

**హుస్నాబాద్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



హుస్నాబాద్ మండల నూతన మండల అభివృద్ధి అధికారి ఎంపీడీవోగా వి. సురేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్-1 అధికారిగా ఎంపికైన ఆయన, గతంలో ఆసిఫాబాద్ జిల్లాలో విధులు నిర్వహించారు. 2025లో ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన సురేందర్, రెండు నెలల శిక్షణ పూర్తి చేసిన అనంతరం హుస్నాబాద్‌కు బదిలీపై వచ్చి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగ జీవితంలో ఇప్పటివరకు సుమారు ఏడు నెలల అనుభవం కలిగిన ఆయన, హుస్నాబాద్ మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా మండల కార్యాలయ సిబ్బంది, అధికారులు నూతన ఎంపీడీవో వి. సురేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, మండల సమగ్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. హుస్నాబాద్ అభివృద్ధి దిశగా కొత్త ఎంపీడీవో సురేందర్ సంకల్పం వ్యక్తం చేశారు.

### సముద్రాలలో నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సామ జీవన్ రెడ్డి



హుస్నాబాద్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గ్రామానికి నూతన కార్యదర్శిగా సామ జీవన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయనకు సన్మానం చేసి స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధి కోసం యువ కార్యదర్శి ముందుండి సమన్వయంతో పనిచేయాలని గ్రామ శాఖ అధ్యక్షుడు చాడ శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతకింది సింగరయ్య, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొల్ల రాంరెడ్డి, దున్నపోతుల ఐలయ్య, ఉప్పుల రమేష్, వంగర గాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, మహేందర్, బైరీ సాయి కృష్ణ, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధి దిశగా కొత్త కార్యదర్శి సామ జీవన్ రెడ్డి కృషి చేయాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ







**కరీంనగర్/ఖానాపూర్/హుస్నాబాద్/మానకొండూర్/మహేశ్వరం, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఉత్సాహంగా జరిగింది. గన్నేరువరం, ఎల్కతుర్తి మండలాల్లో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. తిమ్మాపూర్ రేణికుంట గ్రామంలో సర్పంచ్ ఎలుక అంజనేయులు జెండా ఆవిష్కరించి, విద్యార్థులు, యువకులు చేసిన త్యాగాలను స్మరించారు. హుస్నాబాద్‌లో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమకారుల ర్యాలీ నిర్వహించి, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. డా. మేడిపల్లి సత్యం జెండా ఆవిష్కరించి, సోనియా గాంధీ ఇచ్చిన హామీతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో డా. నరేందర్ రెడ్డి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, విద్యాసంస్థల పాత్రను ప్రస్తావించారు. కరీంనగర్ టవర్ సర్కిల్‌లో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ కార్యక్రమం జరిగింది. దాదాపు 2,500 మందికి పైగా ప్రయాణికులు, భక్తులకు చల్లని మజ్జిగ అందించారు. హౌసింగ్ బోర్డు కాలనీలో బీజేపీ నాయకులు వాడే వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్ సర్కిల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రామిడి రామిరెడ్డి జెండా ఆవిష్కరించి, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని గుర్తుచేశారు. రామడుగు మండలం కొరటపల్లి, పాలకుర్తి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలలో కూడా జెండా ఆవిష్కరణలు జరిగాయి. పాలకుర్తి తహసీల్దార్ జె. సునీత ఉద్యమ పోరాటాలను స్మరించారు. సుడా కార్యాలయంలో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఖానాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరించి తెలంగాణ సాధన తీరును ప్రసంగించారు. పలు గ్రామాల్లో పాఠశాలలు, గ్రామపంచాయతీలు, రైతు వేదికల్లో జాతీయ పతాకావిష్కరణలు జరిగాయి. సత్తెనపల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, పరికరాలు అందజేశారు. ఎల్ఎండీ కాలనీలో ప్రజాభవన్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జెండా ఆవిష్కరించి, అమరుల త్యాగాలు భావి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కరీంనగర్‌లో సిపిఐ జిల్లా కార్యాలయంలో పంజాల శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రాంగణంలో కూడా జెండా వందనం జరిగింది. మానకొండూర్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కంది రాజిరెడ్డి జెండా ఆవిష్కరించి, సుష్మ స్వరాజ్, అరుణ్ జెట్లీ కృషి వల్లే తెలంగాణ సాధ్యమైందని గుర్తుచేశారు. విద్యానగర్లో వినాయక చౌక్‌లో బీజేపీ నాయకులు నరహరి లక్ష్మారెడ్డి జెండా ఆవిష్కరించారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సర్దార్ రవీందర్ సింగ్ కలసి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గంగాడి కృష్ణారెడ్డి జెండా ఆవిష్కరించి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ కీలక పాత్రను గుర్తుచేశారు. కాకినాడ తీర్మానం, పార్లమెంట్‌లో సుష్మా స్వరాజ్ పోషించిన పాత్రను ప్రస్తావిస్తూ, తెలంగాణ సాధనలో బీజేపీ వెన్నెముకగా నిలిచిందని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఉద్యమ ఆశయాలు ఇంకా నెరవేరలేదని విమర్శించారు. మోదీ నాయకత్వంలోనే వికసిత్ తెలంగాణ సాధ్యమవుతుందని, కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల నిధులతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు.కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అధికారిక వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జెండా ఆవిష్కరించి, అమరుల త్యాగాలు మరువలేనివని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, విద్యా, ఆరోగ్య రంగాల్లో సాధించిన విజయాలను వివరించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా జిల్లాలో 3,506 ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు ఘనంగా జరిగాయి.

# శాతవాహనలో మహిళా వ్యాయామ విద్య ప్రవేశ పరీక్షలు ప్రారంభం



**కరీంనగర్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వ్యాయామ విద్య--2026 ప్రవేశ పరీక్షలు మూడవ రోజు మహిళలతో ప్రారంభమయ్యాయి. ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ 100 మీటర్ల పరుగు పోటీలు ప్రారంభించి మాట్లాడుతూ, వ్యాయామ విద్య మహిళలకు బంగారు భవిష్యత్తు కల్పిస్తుందని, అనేక కళాశాలల్లో వ్యాయామ అధికారులుగా సేవలందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మహిళలకు సీట్ల సంఖ్య పురుషులతో పోలిస్తే ఎక్కువగా ఉండటంతో ఉపాధి అవకాశాలు మరింత మెరుగ్గా ఉంటాయని అభ్యర్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సింథటిక్ ట్రాక్ నిర్మాణం పూర్తయిన తర్వాత వచ్చే సంవత్సరం నుండి సాయంత్రం కూడా ఫ్లడ్‌లైట్స్ వెలుగులో పరీక్షలు నిర్వహించవచ్చని ఆయన వెల్లడించారు. కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ మాట్లాడుతూ, అభ్యర్థులకు అన్ని సౌకర్యాలతో పరీక్షలు నిర్వహిస్తున్నామని, చివరి రోజు కావడంతో సమయానికి హాజరుకావాలని సూచించారు. మూడవ రోజు బ్యాచిలర్ వ్యాయామ విద్యలో 495 మంది దరఖాస్తు చేసుకోగా 368 మంది హాజరయ్యారు. డిప్లమా వ్యాయామ విద్యలో 186 మంది దరఖాస్తు చేసుకోగా 124 మంది హాజరయ్యారు. శారీరక సామర్థ్య పరీక్షల్లో 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ నిర్వహించగా, నైపుణ్య పరీక్షల్లో ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ పోటీలు జరిగాయి.ఈ పరీక్షల నిర్వహణలో స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ నజీముద్దీన్ మునవర్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా. కృష్ణ కుమార్, డాక్టర్ దీప్లా, డాక్టర్ జగన్, డా. సునిల్ రావు, ఆచార్య సునీల్ కుమార్, పీడీ విజయ్ కుమార్, వివిధ విశ్వవిద్యాలయ వ్యాయామ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు. మహిళా అభ్యర్థులు ప్రతిభ చాటుతూ తెలంగాణ పిఈసెట్ 2026లో అర్హత సాధించాలని అధికారులు ఆకాంక్షించారు.

### బాసర ఐఐఐటీ సీటు సాధించిన మధు ప్రియ



**తిమ్మాపూర్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన జెడ్‌పి హెచ్‌ఎస్ విద్యార్థిని బుర్ర మధు ప్రియ పదవ తరగతిలో మండల టాపర్‌గా నిలిచి బాసర ఐఐఐటీ ప్రవేశానికి ఎంపికై పాఠశాలకు గర్వకారణమయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఉన్నత విద్యావకాశాలను అందుకోవచ్చని ఈ సందర్భం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు.బుర్ర మధు ప్రియ విజయంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు మధు ప్రియ విజయం మరో ఉదాహరణగా నిలిచింది.

### జిల్లా విద్యాధికారిగా ప్రశాంత్ రెడ్డి బాధ్యతలు



**కరీంనగర్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నూతనంగా జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. ప్రశాంత్ రెడ్డికి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిటిఏ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు గాజుల రవీందర్, ప్రధాన కార్యదర్శి మోతె చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు మాగంటి శ్రీనివాస్, కోశాధికారి బి. శ్రీనివాస్, సభ్యులు రాజేందర్, ప్రసాద్ రావు, సంగోజు సత్యనారాయణ చారి, వి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.ఉపాధ్యాయ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కొత్త విద్యాధికారిని సంఘం కోరింది.జిల్లా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## దళితునిపై దాడి చేసిన బీజేపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**పెద్దపల్లి, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జులపల్లి పంచాయతీ కార్యదర్శి అయిన దళిత ఉద్యోగిపై దాడి చేసి కులపేరుతో దూషించిన బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్‌ను పార్టీ నుండి బహిష్కరించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పాటకుల మహేష్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావుకు, జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దళితులపై దాడులు చేస్తే ఊరుకోబోమని హెచ్చరిస్తూ, అంబేద్కర్‌ను గౌరవించే పార్టీగా చెప్పుకునే బీజేపీ ఇలాంటి ఘటనలను ఖండించకపోవడం దళితులపై దాడిగా భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిని వెంటనే బహిష్కరించకపోతే, దళిత సంఘాల ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. దళితులపై దాడి చేసిన నాయకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు డిమాండ్ చేసింది.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు





**కరీంనగర్ రూరల్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నాలుగు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడ్డాయి. నగునూర్ గ్రామానికి చెందిన సూర రాజమౌళి, ఒర్సు నర్సయ్య తమ ట్రాక్టర్లలో వాగు నుండి ఇసుకను దొంగలించి కరీంనగర్ వైపు తరలిస్తుండగా నగునూర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అలాగే సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన నాగపూరి అజయ్, ఎలవేణి సంపత్ మానేరు వాగు నుండి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా దుర్శెడ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పలుమార్లు పట్టుబడితే సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. అక్రమ రవాణాపై పోలీసులు ముమ్మర చర్యలు కొనసాగిస్తున్నారు.

## కేత్ బచావో అభియాన్ నేల ఆరోగ్య పరిరక్షణ కాంపెయిన్ ప్రారంభం



**జమ్మికుంట, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ, ఏటీఎంఏ ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్ నేల ఆరోగ్య పరిరక్షణ కాంపెయిన్ ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పోస్టర్‌ను ఆవిష్కరించి, జూన్ 1 నుండి 30 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు అనుగుణంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులలో నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంచడమే ఈ కాంపెయిన్ ప్రధాన లక్ష్యం.

## అమెరికాలో 30 మంది భారతీయ ట్రక్కు డ్రైవర్లు అరెస్టు

**న్యూయార్క్ జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమెరికాలో అక్రమంగా జీవిస్తూ కమర్షియల్ ట్రక్కు డ్రైవర్లు గా పనిచేస్తున్న సుమారు 30 మంది భారతీయులను అరెస్టు చేశారు. ఫెడరల్ ఆపరేషన్‌లో భాగంగా వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ట్రక్కు డ్రైవర్లను త్వరలో డిపోర్టు చేయనున్నారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ శాఖ ఈ విషయాన్ని ప్రకటించింది. మే 11 నుంచి 15వ తేదీ మధ్య జరిగిన ఆపరేషన్ చెక్‌మేట్‌లో భాగంగా అక్రమ డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ప్రభుత్వం చెప్పింది. ఆరిజోనాలోని యుమా సెక్టార్‌లో ఉన్న బోర్డర్ పెట్రోలింగ్ ఏజెంట్లు ఆ డ్రైవర్లను అరెస్టు చేశారు. మొత్తం 52 మందిని అదుపులోకి తీసుకున్నారు. దీంట్లో 36 మందిని సెమీ ట్రక్కు డ్రైవర్లుగా గుర్తించారు. వారిలో 30 మంది భారతీయులుగా తేల్చారు. మిగితా ఆరుగురిలో మెక్సికో, ఎల్ సాల్వడార్, రష్యాకు చెందిన వారు ఉన్నారు. కొందరికి కాలిఫోర్నియా, న్యూయార్క్, వాషింగ్టన్, వర్జీనియా రాష్ట్రాలకు చెందిన కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్సులు ఉన్నాయి.

## గ్రామసభల ద్వారా సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన

**కరీంనగర్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సూచించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, జూన్ 4, 6, 8, 10 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సభల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం, సాగునీటి పనులు, కాలువల అభివృద్ధి, పంటల మార్పిడి విధానం, పర్యావరణ పరిరక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎరువుల బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలని, నిల్వలు, గోదాములపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. నానో యూరియా వినియోగాన్ని



ప్రోత్సహించాలని, నకిలీ విత్తనాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లాకు విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాలని, లోటు వర్షపాతం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ సూచించారు. వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి కందులు, జొన్నలు, శనగలు, మినుములు, పెసర్లు, ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య మాట్లాడుతూ, గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, తాగునీటి పరిరక్షణ, మొక్కల పెంపకం, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, గ్రామసభల నిర్వహణలో పోలీసు శాఖ అధికారులు అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేయాలని, మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం కావాలని అధికారులు సంకల్పం వ్యక్తం చేశారు.

## గ్రామ గ్రామాన, పట్టణాల్లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పెద్దపల్లి/కరీంనగర్ రూరల్, జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రవ్యాప్తంగా 12వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. పెద్దపల్లి నియోజకవర్గంలో గ్రామ గ్రామాన, పట్టణాల్లో వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేటీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం నిరోధిస్తోందని విమర్శించారు. తెలంగాణ శక్తులన్నీ మళ్లీ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, తెలంగాణ తల్లి ఆశయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కూడా



వేడుకలు ఘనంగా జరిగాయి. చైర్మన్ అన్నయ్య గౌడ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠకులు పాల్గొన్నారు. పెద్దకాల్వల గ్రామ బస్టాండ్ వద్ద తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి, ఉద్యమకారులకు ఘన సన్మానం చేశారు. సలేంద్ర కొమురయ్య యాదవ్ మాట్లాడుతూ, ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని, 250 గజాల స్థలం, పెన్షన్ హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్ రూరల్ మండలంలోని చింతకుంటలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణరావు జాతీయ జెండా ఆవిష్కరించి, జై తెలంగాణ నినాదాలు చేశారు. ఉద్యమంలో అమరుల త్యాగాలను గుర్తుచేసి, తెలంగాణలో మళ్లీ ఆంధ్ర ఆధిపత్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, తెలంగాణను కాపాడుకోవాలని నేతలు పిలుపునిచ్చారు.

## త్వరలో ఇథనాల్ స్టవ్‌లు!

-వాణిజ్య ఎల్పీజీకి ప్రత్యామ్నాయం
-కేంద్ర ప్రభుత్వానికి ఇథనాల్ తయారీదారుల ప్రతిపాదనలు




**న్యూఢిల్లీ జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ వినియోగదారులకు త్వరలో ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. త్వరలోనే ఇథనాల్ ఆధారిత వంట పొయ్యిని అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. గ్రెయిన్ ఇథనాల్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (జీఈఎంఏ) ప్రెసిడెంట్ సీకే జైన్ మాట్లాడుతూ.. ఇథనాల్ తయారీదారులు వాణిజ్య అవసరాల కోసం ఈ వంట పొయ్యిపై పని చేస్తున్నారని, దీనికి సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించారని తెలిపారు. పంపిణీ, రీఫిల్లింగ్ వంటి కొన్ని ప్రారంభ సవాళ్లు ఉన్నాయని, వాటిపై ప్రస్తుతం పని జరుగుతున్నదని, అవి పరిష్కారం అయిన తర్వాత వాణిజ్యపరంగా దీనిని ఉపయోగించడం ప్రారంభించవచ్చని అన్నారు. వాణిజ్య అవసరాల కోసం ఎల్పీజీ స్థానంలో ఇథనాల్‌ను ఉపయోగించవచ్చు. ఇది ముడి చమురుపై ప్రస్తుతం ఆధారపడుతున్న దానిలో దాదాపు 15 శాతంగా ఉంది. ఆ 15 శాతం దిగుమతిని తగ్గించుకున్నా అది పెద్ద విజయమే అవుతుంది” అని జైన్ చెప్పారు. భవిష్యత్తులో వచ్చే ఇంధన షాక్‌ల నుంచి, పెరుగుతున్న ముడి చమురు ధరల నుంచి భారత్ తనను తాను రక్షించుకోవాలని చూస్తున్న తరుణంలో, దేశం దీర్ఘకాలిక ఇంధన పరివర్తన వ్యూహంలో ఇథనాల్ బ్లెండింగ్ కీలకమైన అంశంగా ఉంటుందని అన్నారు. ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ముడి చమురు సరఫరా సంక్షోభం కారణంగా వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలు వరుసగా పెరుగుతూనే ఉన్నాయి.

## స్నేహం పేరుతో దాడి చేయడం ఆమోద్యయోగం కాదు

**న్యూఢిల్లీ:జూన్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యూపీలోని ఘజియాబాద్‌లో ఇటీవల ఓ వ్యక్తిని అతని స్నేహితులు కత్తితో పొడిచి చంపిన విషయం తెలిసిందే. ఆ ఘటన పట్ల సీఎం యోగి ఆదిత్యనాథ్(జవీ ˉశీస్త్రఱ ాాంత్ఝఅఫ్ష్ర) స్పందించారు. స్నేహం ముసుగులో ఓ వ్యక్తిని హత్య చేయడం ఆమోదయోగ్యం కాదు అని ఆదిత్యనాథ్ అన్నారు. తమ పిల్లలకు క్రమశిక్షణ, మార్గదర్శనం చేయలేకపోతున్న వారు తీవ్రమైన తప్పులు చేస్తున్నారని అన్నారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ఓ మౌలానా చేసిన సూచనను ఆయన వ్యతిరేకించారు. భారతీయ సంస్కృతిలో గోవును మాతగా ఆరాధిస్తారన్నారు. అటువంటి బంధానికి ప్రత్యేకంగా గుర్తింపు అవసరం లేదన్నారు. తల్లిని గౌరవించాలని ఓ కుమారుడికి చెప్పాల్సిన అవసరం లేదని, తల్లులకు, గోవుల పట్ల పిల్లలు ప్రేమతో ఉంటారన్నారు. గోవుల ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి, బక్రీద్ శు



భాకాంక్షలు చెబుతున్న వారికి ఆయన వార్నింగ్ ఇచ్చారు. యూపీలో గో హత్య జరిగే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువులపై దాడి జరుగుతుంటే, వివిధ మతాలకు చెందిన నేతలు మౌనంగా ఉన్నారని విమర్శించారు స్థానిక ప్రభుత్వ చర్యలను అక్కడి మత నేతలు ఖండించడం లేదన్నారు. భారత్‌కు పాకిస్థాన్ శత్రువు అని ఆ నేతలు పబ్లిక్‌గా చెప్పాలన్నారు. గతంలో రామనవమి, జన్మాష్టమి, దుర్గాపూజా, కన్వర్ యాత్ర పండుగల వేళ రాష్ట్రంలో అలజడి పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ప్రశాంతంగా ఆ పండుగలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో మహిళలు, విద్యార్థులు, వ్యాపారులు అభద్రతాభావంలో ఉండేవారని, కానీ ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. కరుణ, అహింసా అనేవి ఉత్తమ మానవ గుణాలని, కానీ శాంతి, భద్రతను ఎదుర్కొనేందుకు సమాజం సిద్ధంగా ఉండాలన్నారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడి బోధనలు ఆయన గుర్తు చేస్తూ.. ప్రజలను, మహిళలను, అణగారిన వారిని రక్షించుకోవాలన్నారు. జాతి వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవాలన్నారు.

# బిజినెస్

## వాహన విక్రయాలు భళా

**న్యూఢిల్లీ** : కార్ల అమ్మకాలు గత నెలలో జోరుగా సాగాయి. మేలో మారుతీ సుజుకీ, కియా ఇండియాలైతే రికార్డు సేల్స్‌ను నమోదు చేశాయి. దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీ సంస్థ విక్రయాలు మునుపెన్నడూ లేనివిధంగా 1,93,535 యూనిట్లుగా ఉన్నాయి. నిరుడు మేలో 1,38,690 యూనిట్లేనని సోమవారం విడుదల చేసిన గణాంకాల్లో తేలింది. మార్కెట్‌లో ఇంధన ధరలు పెరిగినా డిమాండ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషమేనని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మార్కెటింగ్ అండ్ సేల్స్ పార్థో బెనర్జీ పీటీఐతో అంటున్నారు. నిజానికి చిన్న కార్ల విక్రయాలను పెరిగిన పెట్రో ధరలు ప్రభావితం చేయగలవు. కానీ మా కార్ల సేల్స్ ఆకర్షణీయమైన వృద్ధిని కనబర్చాయి. మినీ, కంపాక్ట్ సెగ్మెంట్ ప్యాసింజర్ కార్ల విక్రయాల్లో 42 శాతం పెరుగుదల ఉన్నది. ఆల్టో, ఎస్-ప్రెస్సో సేల్స్ గత ఏడాదితో పోల్చితే 6,776 యూనిట్ల నుంచి 16,275 యూనిట్లకు పెరిగాయి. బలెనో, సెలీరియో, డిజైర్, ఇగ్నీస్, స్విఫ్ట్, వాగనార్ అమ్మకాలు కూడా 61,960 యూనిట్ల నుంచి 81,555 యూనిట్లకు చేరాయి' అన్నారు. ఇక కియా సేల్స్ 23.6 శాతం వృద్ధిని కనబర్చాయి. తొలిసారి ఒక నెలలో 27,586 యూనిట్లను అమ్మినట్టు సంస్థ తెలిపింది.

మే నెలలో వాహన విక్రయాలు (యూనిట్లలో)

| సంస్థ | 2026 | 2025 |
|---|---|---|
| మారుతీ సుజుకీ | 1,93,535 | 1,38,690 |
| టాటా మోటార్స్ | 59,090 | 41,557 |
| మహీంద్రా | 58,021 | 47,837 |
| హ్యుందాయ్ | 47,837 | - |
| టొయోటా | 30,574 | 29,280 |
| కియా ఇండియా | 27,586 | 22,315 |
| టీవీఎస్ | 5,66,585 | 4,31,275 |
| హోండా | 5,18,000 | 4,65,000 |
| బజాజ్ | 4,61,257 | 3,84,621 |
| సుజుకీ మోటార్ | 1,32,244 | 1,28,897 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 1,03,231 | 89,429 |

## మంచి మైలేజీ ఇస్తూ దేశంలోనే అత్యంత తక్కువ ధరల్లో లభించే కార్లు ఏవో తెలుసా..?

పెట్రోల్, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తక్కువ నెలవారీ ఖర్చులతో కూడిన కార్ల కోసం చూస్తున్నారు. అందుకే వివిధ విభాగాలలో అత్యధిక మైలేజీనిచ్చే కార్లు వార్తల్లో నిలుస్తున్నాయి. ఎంట్రీ-లెవల్ హ్యాచ్‌బ్యాక్‌ల నుండి లగ్జరీ ఈవీల వరకు, ప్రతి కేటగిరీలోనూ ఇంధన సామర్థ్యంలో రాణించే మోడల్ ఒకటి ఉంది. కొన్ని విభాగాలలో సీఎన్‌జీ కార్లు అత్యంత పొదుపుగా ఉండగా, మరికొన్నింటిలో హైబ్రిడ్ టెక్నాలజీ పైచేయి సాధిస్తోంది. ఏ విభాగంలో ఏ కారు అత్యంత ఇంధన సామర్థ్యం కలిగి ఉందో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఎంట్రీ సెగ్మెంట్‌లో ఎవరు ముందున్నారు?**

మారుతి సుజుకి ఆల్టో కె10 ఎంట్రీ-లెవల్ సెగ్మెంట్‌లో అత్యంత ఇంధన సామర్థ్యం గల కారుగా నిలిచింది. దీని పెట్రోల్ వెర్షన్ లీటరుకు 24.90 కిలోమీటర్ల వరకు మైలేజీని ఇస్తుంది. కాగా దీని CNG వెర్షన్ కిలోగ్రాముకు 33.40 కిలోమీటర్ల




వరకు మైలేజీని సాధించగలదు. మొదటిసారి కారు కొనేవారికి మరియు నగరంలో రోజూ నడిపే వారికి ఇది తక్కువ ఖర్చుతో కూడిన కారుగా పరిగణించబడుతుంది. అయితే, జచీ+ వెర్షన్‌లో బూట్ స్పేస్ కొద్దిగా తక్కువగా ఉంటుంది.

**విలువ విభాగంలో ఎవరు ఆధిపత్యం చెలాయిస్తున్నారు?**

రూ. 5-10 లక్షల సెగ్మెంట్‌లో మారుతి సుజుకి డిజైర్ అత్యంత సరసమైన ఎంపికగా నిలుస్తుంది. కంపెనీ ప్రకారం.. పెట్రోల్ మాన్యువల్ వెర్షన్ 24.79 కి.మీ/ మైలేజీని, ఆమీ వెర్షన్ 25.71 కి.మీ/లీ మైలేజీని అందిస్తుంది. జచీ+ వెర్షన్ 33.73 కి.మీ/కి.మీ వరకు మైలేజీని ఇస్తుందని కంపెనీ పేర్కొంది. ఇది మంచి క్యాబిన్ స్పేస్‌తో పాటు ఇంధన సామర్థ్యాన్ని కూడా అందిస్తూ, కుటుంబాలకు ఒక గొప్ప ఎంపికగా నిలుస్తుంది.

## రికార్డుస్థాయికి యూపీఐ లావాదేవీలు

**న్యూఢిల్లీ,**
యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మే నెలలో రూ.29.90 లక్షల కోట్ల 23.2 బిలయన్ డాలర్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగినట్టు ఎన్‌పీసీఐ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏప్రిల్ నెలలో రూ.29.03 లక్షల కోట్ల లావాదేవీలు జరుగగా, అంతక్రితం ఏడాది ఇదే నెలలో రూ.25.14 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నాయి. విలువ పరంగా చూస్తే క్రితం ఏడాది ఇదే నెలలో 18.67 బిలియన్ల లావాదేవీలు జరుగగా, ఈసారి 24 శాతం వృద్ధితో 23.2 బిలియన్లకు చేరుకున్నాయని క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ కో-ఫౌండర్, సీఈవో ఆకాశ్ సిన్హా తెలిపారు. వేసవి ప్రయాణాలు, ఐపీఎల్ 2026, కాలానుగుణంగా వినియోగదారులు యూపీఐ ద్వారా తమ చెల్లింపులు జరుపడం వల్లనే రికార్డు స్థాయికి చేరుకున్నాయన్నారు.




## టీమిండియాకు కొత్త కోచ్.. స్పిన్ దళం బాధ్యతలు అప్పగింత..!

భారత జట్టుకు మరో కోచ్‌గా సాయిరాజ్ బహతులే నియమితులయ్యాడు. మాజీ ఆటగాడైన బహతులేకు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు అప్పగించింది బీసీసీఐ . ఐపీఎల్‌లో పలు జట్ల స్పిన్నర్లను రాటుదేల్చిన ఈ మాజీ ఆటగాడు ఇకపై టీమిండియా స్పిన్ యూనిట్‌ను సానబెడుతాని మంగళవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. టీమిండియా పురుషుల సీనియర్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు బహతులే తెలిపాడు ఐపీఎల్ ముగియడమే ఆలస్యం.. భారత జట్టుకు కొత్తకోచ్‌ను ఖరారు చేసింది బీసీసీఐ. అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు, వన్డే సిరీస్ ఆరంభానికి ముందే స్పిన్ బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహతులేను నియమించింది. దేశవాళీ క్రికెట్ దిగ్గజమైన ఆయన అంతర్జాతీయ క్రికెట్‌లోనూ గొప్పగా రాణించాడు సాయిరాజ్ బహతులే. ఆటగాడిగా, కోచ్‌గా ఆయన అనుభవం భారత జట్టుకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఏళ్లుగా దేశవాళీలో, ఫ్రాంచైజీ క్రికెట్‌లో స్పిన్నర్లను సానబెట్టడంలో బహతులే విజయవంతమయ్యాడు. అందుకని బహతులేను స్పిన్ బౌలింగ్ కోచ్‌గా నియమించాం అని బీసీసీఐ వెల్లడించింది. ఐపీఎల్‌లో మెరిసే అటగాళ్లకే



కాదు బౌలర్లను సానబెట్టే కోచ్‌లకు బీసీసీఐ అవకాశాలు కల్పిస్తోంది అనడానికి బహతులే నియామకమే తాజా ఉదాహరణ.

**ఎంతో గర్వకారణం**

టీమిండియా కోచ్‌గా నియమితులవ్వడం పట్ల బహతులే సంతోషం వ్యక్తం చేశాడు. 'భారత జట్టుకు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా నియమితులవ్వడం నిజంగా గొప్ప గౌరవం. ఆటగాడిగా దేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణం. ఇప్పుడు కోచ్‌గా భారత క్రికెట్ విజయాల్లో భాగమయ్యే అవకాశం దక్కడం ఎంతో ప్రత్యేకం. అన్ని ఫార్మాట్లలో విజయవంతమవ్వడానికి ఆటగాళ్లు, సహాయక సిబ్బందితో కలిసి పనిచేసేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని వెల్లడించిన బహతులే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్లకు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా సేవలందించాడు.

**దేశవాళీలో హిట్..**

మహారాష్ట్రకు చెందిన సాయిరాజ్ బహతులే ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో రెండు దశాబ్దాలు మెరిశాడు. ముంబై, మహారాష్ట్ర, అస్సాం, ఆంధ్ర, విదర్భ జట్లకు ప్రాతినిధ్యం వహించిన బహతులే 188 మ్యాచులు ఆడాడు. తన స్పిన్ మ్యాజిక్‌తో 188 వికెట్లు తీయడమే కాకుండా.. బ్యాట్‌తోనూ రాణించి 6,176 పరుగులు సాధించాడు. దేశవాళీలో ఆల్‌రౌండర్ అనిపించుకున్న అతడికి దేశం తరఫున ఎక్కువ అవకాశాలు దక్కలేదు. టీమిండియా తరఫున బహతులే రెండు టెస్టులు, 8 వన్డేలు మాత్రమే ఆడాడు.

# స్పోర్ట్స్

## లార్డ్స్ టెస్టుకు ఓపెనర్‌గా 'గే'.. యువ పేసర్ అరంగేట్రం..!




ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో ఆరో స్థానంలో కొనసాగుతున్న ఇంగ్లండ్ స్వదేశంలో న్యూజిలాండ్ తో తలపడుతోంది. మూడు టెస్టుల సిరీస్‌కు సన్నద్ధమైన ఇంగ్లండ్ మంగళవారం తమ జట్టును ప్రకటించింది. లార్డ్స్ స్టేడియంలో జూన్ 4 గురువారం నుంచి మొదలయ్యే తొలి టెస్టుకోసం ఓపెనర్‌గా ఎమిలియో గే ఎంపికయ్యాడు. దేశవాళీలో పరుగుల వరద పారించిన గే ఈ మ్యాచ్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయనున్నాడు. పేసర్ సోనీ బేర్ కూడా లార్డ్స్ టెస్టుతో ఎంట్రీ ఇచ్చే అవకాశముంది. సొంతగడ్డపై బెన్ స్టోక్స్ సేన న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఇరుజట్ల మధ్య జూన్ 4 న తొలి టెస్టు జరుగనుంది. దాంతో.. ఆనవాయితీ ప్రకారం రెండు రోజుల ముందే ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. స్టోక్స్ సారథిగా 12 మందితో కూడిన బృందంలో ఎమిలియో గే ఓపెనర్‌గా, సోనీ బేకర్ పేసర్‌గా ఎంపికయ్యారు. టాపర్డర్‌లో క్రాలే, ఓలీ పోప్ స్థానంలో గే, జాకబ్ బెథెల్ బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. జోష్ టంగ్, అట్కిన్సన్, ఓలీ రాబిన్సన్‌లలో ఒకరి స్థానంలో బేకర్ కొత్త బంతిని పంచుకునే అవకాశముంది. ఇంగ్లండ్ న్యూజిలాండ్ జట్లు జూన్ 17 న రెండో టెస్టు, జూన్ 25 నుంచి మూడో టెస్టు జరుగనుంది.

ఇంగ్లండ్ తుది జట్టు (తొలి టెస్టు కోసం) : బెన్ డకెట్, ఎమిలియో గే, జాకబ్ బెథెల్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), బెన్ స్టోక్స్(కెప్టెన్), ఓలీ రాబిన్సన్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్, షోయబ్ బషీర్, సోనీ బేకర్.

## నెట్ బౌలర్‌గా 'బారాముల్లా ఎక్స్‌ప్రెస్'..

### -ఐపీఎల్ స్టార్లకు పిలుపు..!

ఐపీఎల్ సందడి ముగియడంతో త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్ జోష్ మొదలవ్వనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ లో భాగంగా భారత జట్టు సొంత గడ్డపై అఫ్గనిస్థాన్‌ను ఢీ కొట్టనుంది. ఏకైక టెస్టు కోసం ఇప్పటికే స్క్వాడ్‌ను ప్రకటించిన సెలెక్టర్లు నెట్ బౌలర్‌గా అకీబ్ నబీ ని తీసుకున్నారు. నబీని స్క్వాడ్‌లోకి తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు నెట్ బౌలర్‌గా తీసుకున్నారు. ఐపీఎల్ 19వ సీజన్‌లో ఆకట్టుకున్న ప్రిన్స్ యాదవ్ , గుర్జప్నీత్ సింగ్‌లు సైతం ఎంపికయ్యారు. అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టుతో భారత జట్టు స్వదేశంలో మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో గెలుపొంది డబ్ల్యూటీసీలో ముందంజ వేయాలని శుభ్‌మన్ గిల్ సేన ఆశిస్తోంది. దాంతో.. ధనాధన్ టీ20 నుంచి బ్యాటర్లు సుదీర్ఘ ఫార్మాట్‌కు అలవాటు పడేందుకు నెట్ బౌలర్లు కీలకం కానున్నారు. అందుకని.. అఫ్గన్ టెస్టుకు ముందే ఆరుగురు (ముగ్గురు పేసర్లు, ముగ్గురు



స్పిన్నర్లు) యువకెరటాలను సెలెక్టర్లు ఎంపిక చేశారు. జుమ్ముకశ్మీర్ తొలిసారి రంజీ ఛాంపియన్‌గా నిలవడంలో కీలకమైన అకీబ్ నబీతో పాటు ఐపీఎల్ స్టార్లు ప్రిన్స్ యాదవ్, గుర్జప్నీత్ సింగ్‌లు స్క్వాడ్‌తో కలువనున్నారు. కాబూలీ స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొనేందుకు సరాన్ష్ జైన్(ఆఫ్ స్పిన్నర్), శివాంగ్ కుమార్(లెగ్ బ్రేక్), జీషన్ అన్సారీ(ఎడమచేతి మణికట్టు స్పిన్నర్)లు నెట్స్‌లో భారత క్రికెటర్లకు బౌలింగ్ చేయనున్నారు. ముల్లన్‌పూర్‌లో జూన్ 6 నుంచి10వ తేదీ వరకు భారత్, అఫ్గనిస్థాన్ మధ్య ఏకైక టెస్టు జరుగనుంది.

**నెట్ బౌలర్లు :** అకీబ్ నబీ, ప్రిన్స్ యాదవ్, గుర్జప్నీత్ సింగ్, సరాన్ష్ జైన్, జీషన్ అన్సారీ, శివాంగ్ కుమార్.